

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
శనివారం 14 సెప్టెంబరు 2024



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



ముక్కంటి ఆలయంలో పవిత్రోత్సవాలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో తొలిరోజున దక్షిణామూర్తి వద్ద శ్రీ-కాళ-హస్తి ఉత్సవర్లు, భరద్వాజ మహర్షి ఉత్సవ మూర్తికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పూర్ణహారతి సమర్పించాక భరద్వాజ మహర్షి, శ్రీ-కాళ-హస్తి ఉత్సవర్లను మాడవీధుల్లో ఊరేగించారు.

- శ్రీకాళహస్తి



ఎంఎస్ విగ్రహం పునఃప్రతిష్ఠ

ప్రఖ్యాత సంగీత సామ్రాజ్ఞి, దివంగత ఎం.ఎస్.సుబ్బలక్ష్మి విగ్రహాన్ని శుక్రవారం తిరుపతి ఆర్టీసీ బస్టాండు సమీప పూర్ణకుంభం కూడలిలో పునఃప్రతిష్ఠించారు. శ్రీనివాససేతు నిర్మాణంలో భాగంగా గతంలో ఆమె విగ్రహాన్ని తొలగించిన విషయం తెలిసిందే. టీటీడీ, నగరపాలక సంస్థ సహకారంతో ఎస్వీ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమా ముద్దుబాల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. గాత్ర విభాగాధిపతి శబరి గిరీశం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- తిరుపతి అర్బన్

ఆర్టీవో బాధ్యతల స్వీకరణ



తిరుపతి జిల్లా రవాణాశాఖ అధికారిగా మురళీమోహన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లాలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై వచ్చారు. శ్రీవారి పాదాల చెంత విధులు నిర్వహిస్తుండడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఎంవీఐలు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, ఏఎంవీఐ స్వర్ణలత, ఏవోలు, సిబ్బంది ఆయన్ను అభినందించారు.

- తిరుపతి (జీవకోన)

పీజీ కోర్సులకు విశేష స్పందన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 13: ఎస్వీయూలో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి విశేష స్పందన లభిస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తొలి దశ అడ్మిషన్లలోనే ఆర్ట్స్‌లో 68 శాతం, సైన్స్‌లో 64 శాతం, కామర్స్‌లో 57 శాతం సీట్లు భర్తీ అయ్యాయని అన్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 20 శాతం సీట్లు తొలి దశ అడ్మిషన్లలో ఎక్కువగా ప్రవేశాలు పొందినట్టు తెలిపారు.



మొగిలి ఘాట్‌లో మరణ మృదంగం



హన్సిక మృతదేహాన్ని తరలిస్తున్న మొగిలివాసి గోపి

ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్,ఎస్పీ, జేసీ

- 31మందికి గాయాలు
- రెండు లారీల మధ్య నుజ్జయిన ఆర్టీసీ బస్సు
- బస్సు, లారీ డ్రైవర్, ఐదుగురు ప్రయాణికుల దుర్మరణం
- సీఎం చంద్రబాబు, మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి సంతాపం
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

బంగారుపాళ్యం/చిత్తూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలంలోని మొగిలి ఘాట్ రోడ్డులో శుక్రవారం సాయంత్రం 3గంటల ప్రాంతంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బెంగళూరు నుంచి ఐరన్ లోడ్‌తో వస్తోన్న 20 టైర్ల లారీ మొగిలి ఘాట్‌లో అదుపు తప్పింది. డివైడర్ దాటి పక్క రోడ్డులోకి వెళ్లిపోయి తిరుమల నుంచి బెంగుళూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందు భాగాన వేగంగా ఢీకొంది. దీంతో బస్సు ఒక్కసారిగా వెనుదిరిగింది. అదే సమయంలో ఆ బస్సు వెనుక వస్తున్న గ్రానైట్ లోడ్ లారీ బస్సును మరోసారి ఢీకొంది. ఈ దుర్ఘటనలో ఐరన్ లోడ్ లారీ డ్రైవర్, బస్సు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఇద్దరితో పాటు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఐదుగురు మృత్యువాత పడగా 8మందికి తీవ్ర గాయాలయ్యాయి. మొత్తం 31మంది గాయపడగా వీరిలో గ్రానైట్ లారీలోని వారు ముగ్గురున్నారు.వీరందరినీ తొలుత పలమనేరు ఏరియా ఆస్పత్రికి పంపించి చికిత్స అందించాక ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి తరలించారు.

కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ, జేసీ విద్యాధరి, డీటీసీ నిరంజన్‌రెడ్డి తదితరులు ప్రమాదం జరిగిన ప్రాంతానికి వెళ్లి సహాయక చర్యల్ని వేగవంతం చేశారు. ఈ ప్రమాద కారణంగా రెండు లారీలు, ఓ బస్సు రోడ్డు మీద ఉండిపోవడంతో పోలీసులు ట్రాఫిక్‌ను ఓ వైపునకు మళ్లించారు.

సహాయక చర్యల్లో స్థానికులు

ఆర్టీసీ బస్సు డ్రైవర్ మనోహర్ సీటులో నుంచి ఎగిరిపడి లారీ కమ్మీల మధ్య చిక్కుకుని మృతి చెందారు.సీట్ల మధ్యలో ఇరుక్కుపోయిన కండక్టర్ చిరంజీవిని వెలికి తీయడానికి సుమారు గంట పట్టింది. గునపాలతో, రాడ్లతో నిగ్గదీసి స్థానికులు, అధికారులు ఆయన్ను వెలికితీసి 108 అంబులెన్స్‌లో చిత్తూరు ఆస్పత్రికి తరలించారు.పరిస్థితి విషమంగా మారడంతో వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పూతలపట్టు మండలంలోని చిటిపిరాళ్ల గ్రామం ఈయన సొంతూరు. ఐరన్ లోడ్ లారీ డ్రైవర్ కూడా అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన మృతదేహం కమ్మీల కింద ఇరుక్కోవడంతో పోలీసులు, స్థానికులు ఎక్స్‌కవేటర్ సాయంతో కమ్మీలను పక్కకు జరిపి వెలికితీశారు. బస్సులో నుంచి కింద ఎగిరిపడ్డ ఓ బాలుడి మృతదేహాన్ని మొగిలికి చెందిన గోపి రెండు చేతుల్లో తీసుకుని అంబులెన్సులోకి ఎక్కించారు. మొగిలిలోని శ్రీని ఫుడ్స్ ఫ్యాక్టరీ మేనేజర్ తన సిబ్బందితో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. ఏడు మృతదేహాలను వెలికితీసి ఆస్పత్రికి తరలించడానికి సుమారు గంటన్నర సమయం పట్టింది.

మృతుల వివరాలు

- మనోహరన్ (56), తిరుపతిలోని అలిపిరి ఆర్టీసీ డిపో డ్రైవర్. తిరుపతిలోని సత్యనారాయణపురం నివాస ప్రాంతం.
- సోనుకుమార్ (31), ఐరన్ లోడ్‌తో వచ్చి ఢీకొన్న 20 టైర్ల లారీ డ్రైవర్. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బల్లియా జిల్లా ఖరిద్ ఖాజీపూర్ ప్రాంతం
- హన్సిక యాదవ్ (6), మహారాష్ట్రలోని జశ్వంత్‌పూర్‌కు చెందిన అమ్మాయి. బస్సులో ప్రయాణిస్తోంది.
- బాలరాజు (55), తెలంగాణ రాష్ట్రం సిద్ధిపేట జిల్లాకు చెందిన వ్యక్తి
- విజయమ్మ (53), కంబాలమిట్ట,కావలివారి పల్లె పంచాయతీ, పాకాల మండలం. బెంగళూరులో వుంటోన్న కుమార్తె వద్దకు బస్సులో వెళుతోంది.
- శంకరరెడ్డి (50), ఎస్ఎస్ కొండ, జీడీనెల్లూరు మండలం
- కులసాంబి(55), టిన్‌ఫ్యాక్టరీ, బెంగళూరుకు చెందిన మహిళ.

క్షతగాత్రుల వివరాలు

పలమనేరు, సెప్టెంబరు 13 : మొగిలిఘాట్ ప్రమాదంలో 31 మంది గాయపడ్డారు. వీరిలో 20 మంది తీవ్రంగా గాయపడగా 11మంది స్వల్పంగా గాయపడ్డారు.క్షతగాత్రులైన శివ(27), రిక్కి(36), చిరంజీవి(45), బాబురెడ్డి(45), మురళి(35), అస్మిత్‌యాదవ్(3), పద్మావతి(54), లావణ్య(23), జి. అమరనాథ్(40), మంజు(50), సక్కుబాయ్(73), విష్ణు(29), కళ్యాణ్(26), సీహెచ్ వెంకటేశ్(35), ఎ.ఎన్. శ్రీనివాస్(6), శ్రీధర్(48), రుతిక్ (7), నేతాజి(33), వెంకటరమణ (24), ఎ. అక్రమ్(28), ముబారక్(27), కృష్ణ(38), జాస్మిన్‌మాలతి(33), బేబీ ఆఫ్‌జాస్మిన్ మాలతి(2), సురేష్(5), రితిక(44), రక్షిత(15), చిరంజీవి(36), విష్ణు(25), భాస్కర్‌రెడ్డి(55), ప్రశాంత్‌కుమార్(45)లను చికిత్సకోసం పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.వీరిలో ప్రాథమిక చికిత్సానంతరం ఆందోళనకరంగా ఉన్న 8 మంది శివ, రిక్కి, చిరంజీవి, బాబురెడ్డి,మురళి, అస్మిత్‌యాదవ్, పద్మావతి, లావణ్యలను తదుపరి చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మృతుల కుటుంబాలకు సీఎం సంతాపం

సీఎం చంద్రబాబు, రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి ప్రమాదంపై ఆరా తీశారు. వివరాలు తెలుసుకుని మృతుల కుటుంబాలకు సంతా పం తెలిపారు.మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను సీఎం చంద్రబాబు ప్రకటించినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పలమనేరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు.

లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం

ఐరన్ లోడ్‌తో వస్తున్న లారీ డ్రైవర్ సోనుకుమార్ నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణంగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సోనుకుమార్‌కు మొగిలి ఘాట్ మీద అవగాహన లేకపోవడంతో పాటు నిద్రమత్తులో ఉన్నట్లు అనుమానిస్తున్నారు. లారీ అదుపు తప్పడంతోనే డివైడర్ దాటి మరీ అటుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఆ డ్రైవర్ నిర్లక్ష్యం అతనితో పాటు మరో ఆరుగురి ప్రాణాలు బలి తీసుకుంది. చాలామందిని క్షతగాత్రుల్ని చేసింది.



కుమార్తె దగ్గరకు వెళుతూ మృతి చెందిన పాకాలవాసి విజయమ్మ (ఫైల్ ఫొటో)

కూతురు చనిపోయిందని తెలియకనే

మహారాష్ట్రలోని జశ్వంత్‌పూర్‌కు చెందిన ఆరేళ్ల హన్సిక ప్రమాదస్థలంలోనే చనిపోయింది.తల్లిదండ్రులు రిక్కీ, అషతోష్,మూడేళ్ల తమ్ముడు అష్మిత్ యాదవ్‌లతో కలిసి బస్సులో ప్రయాణించిన ఆమె మృతదేహం ఇప్పుడు చిత్తూరు ఆస్పత్రిలోని మార్చు రీ ల ఉంది.ముగ్గురు కుటుంబ సభ్యులకు ఆమె చనిపోయిన విషయాన్ని చెప్పకుండా అదే ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.



అషతోష్‌ను ఓదారుస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్



బాలుడు దొరికాడు

- 24 గంటల్లో కేసు ఛేదించి.. తల్లి ఒడికి చేర్చిన ఈస్ట్ పోలీసులు



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 13: తిరుపతిలో బుధవారం రాత్రి తండ్రి నుంచి అదృశ్యమైన 18 నెలల బాలుడు దొరికాడు. ఎయిర్ బైపాస్ రోడ్డులోని దుస్తుల దుకాణం వద్దనున్న సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా ఈస్ట్ పోలీసులు విచారించారు. పూల వ్యాపారి వద్దనున్న బాలుడిని శుక్రవారం తల్లి ఒడికి చేర్చారు. ఈ వివరాలను తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ మీడియా వెల్లడించారు. ఆ ప్రకారం.. నేపాల్‌కు చెందిన ఎల్‌కైలాస్, మనీషా దంపతులు ఉపాధి నిమిత్తం తిరుపతికి వచ్చారు. పద్మావతిపురంలోని ఓ అపార్టుమెంటులో వాచ్‌మ్యాన్‌గా ఉంటున్నాడు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో తన కుమారుడు బాలాజీకి దుస్తులు, ఇతర వస్తువులు కొనివ్వాలని ఇంటి నుంచి తీసుకొచ్చాడు. బిడ్డను తీసుకుని నగరమంతా తిరిగాడు. దుస్తులు కొనిచ్చాక పూటుగా మద్యం తాగాడు. ఆ తర్వాత గాంధీరోడ్డు, శ్రీదేవి కాంప్లెక్సు, దొడ్డాపురం వీధి తిరిగాడు. బుధవారం సాయంత్రం ఇంటికి వెళ్లడానికి శ్రీదేవి కాంప్లెక్సు వద్ద ఆటో ఎక్కాడు. ఆ తర్వాత ఏం జరిగిందనేది మద్యం మత్తులో ఉన్న కైలాస్ చెప్పలేదు. బిడ్డ కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీతో పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా విచారణ చేపట్టారు. ఆ ప్రకారం.. టౌన్‌బ్యాంకు వద్ద ఆటో దిగి.. బిడ్డకు ఐస్‌క్రీము కొనిచ్చి.. మళ్లీ ఆటోలో అన్నమయ్య సర్కిల్ వద్దకు కైలాస్ చేరుకున్నాడు. అక్కడ బిడ్డతో కలిసి ఆటోలో వెళ్లినట్లు పరిణయ దుస్తుల దుకాణం సీసీ కెమెరాల్లో రికార్డయింది. ఆ ప్రకారం ఈస్ట్ ఏఎస్ఐ రవి, కానిస్టేబుల్ మణికంఠ బృందం వీధి వ్యాపారులకు బిడ్డ ఫొటో చూపుతూ ఆరా తీశారు. బైరాగిపట్టెడలోని ఎంజీఎం స్కూలు వద్ద పూల వ్యాపారి లత వద్ద బిడ్డ ఉన్నట్లు తెలిసింది. అక్కడి వారిని విచారించగా, ఆమె వినాయక నిమజ్జనం కోసం బిడ్డను తీసుకుని పుత్తూరులోని పొట్టిగుట్టలు గ్రామానికి వెళ్లినట్లు చెప్పారు. దీంతో పోలీసులు గురువారం రాత్రి ఆ గ్రామానికి వెళ్లి లతను కలిశారు. 'ఓ వ్యక్తి ఫుల్‌గా మందు తాగి బిడ్డను వదలి పెట్టి వెళ్లడంతో నేను దగ్గరకు తీసుకున్నా. బిడ్డకోసం ఎవరైనా వస్తే నా ఫోను నెంబరు ఇవ్వాలని మా ఊరికి వస్తూ అక్కడి వారికి ఇచ్చా'నని ఆమె పోలీసులకు చెప్పారు. ఈస్ట్ సీఐ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గురువారం అర్ధరాత్రి పోలీసులు బిడ్డను తీసుకుని తిరుపతికి వచ్చారు. శుక్రవారం తల్లితండ్రులకు అప్పగించారు. ఈ విషయంలో విశేష ప్రతిభ కనబరిచిన ఏఎస్ఐ రవి, కానిస్టేబుల్ మణికంఠకు రివార్డుల కోసం ఎస్పీకి సిఫార్సు చేస్తానని డీఎస్పీ వెంకటనారాయణ చెప్పారు.

సెబ్ రద్దు

- 120 మంది ఉద్యోగులు నేటి నుంచి ఎక్సైజ్ శాఖ పరిధిలోకి

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 13: స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో (సెబ్)ను రద్దు చేస్తూ డీజీపీ ద్వారకాతిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని 12 సెబ్ స్టేషన్లు శనివారం నుంచి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సర్కిల్ కార్యాలయాలుగా మారనున్నాయి. అక్కడ పనిచేస్తున్న 12 మంది సీఐలు, మరో 12 మంది ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ళు సిబ్బంది మొత్తం 120 మంది మాతృశాఖకు బదిలీ అయ్యారు. ఇక, పోలీసు శాఖ నుంచి డెప్యుటేషన్‌పై సెబ్‌లో పనిచేస్తున్న అదనపు ఎస్పీ రాజేంద్ర మాతృశాఖకు బదిలీ అయ్యారు. ఆయనకు ఇప్పటి వరకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఇక, తడ వద్ద కొత్తగా ఎక్సైజ్ చెక్ పోస్టు ఏర్పాటు కానుంది. మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు, ఎక్సైజ్ సూపరింటెండెంట్, టాస్క్‌ఫోర్సు ఎన్‌ఫోర్సుమెంటు ఏసీ, మొబైల్ పార్టీలు ఏర్పాటు చేయనున్నారు.

వైసీపీ ప్రభుత్వ తీరుతో పంచాయతీలు నిర్వీర్యం

- కూటమి అధికారంలోకి వచ్చాక పటిష్ఠానికి చర్యలు
- పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు బాబు రాజేంద్ర ప్రసాద్



తిరుపతి(విద్య), సెప్టెంబరు13: 'గత వైసీపీ ప్రభుత్వం సర్పంచులకు కనీస సమాచారం ఇవ్వకుండా నిధులు దారి మళ్లించింది. ఉపాధి హామీ నిధులు రూ.36 కోట్లను దుర్వినియోగం చేసింది. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, సదుపాయాల కల్పన ఆగింది. పంచాయతీలు నిర్వీర్యమై.. సర్పంచులు ఉత్సవ విగ్రహాలుగా మిగిలారు' అని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు బాబు రాజేంద్రప్రసాద్ ఆవేదన వ్యక్తంచేశారు. అందుకనే జగన్‌ను ఓడించామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే పంచాయతీలను బలోపేతం చేసేందుకు రూ.12.48 కోట్లను జమ చేసిందని గుర్తుచేశారు. ఉపాధిహామీ పనులకు రూ.9వేల కోట్లను జమ చేసి.. ఊరూరా గ్రామ సభలు నిర్వహించి అభివృద్ధి కార్యక్రమాలు ఏమేమి చేపట్టాలో మీరే నిర్ణయించండంటూ పంచాయతీలకు నిర్ణయాధికారాన్ని ఇవ్వడం అభినందనీయమన్నారు. గత ఐదేళ్లలో భ్రష్టుపట్టిన గ్రామీణ వ్యవస్థను, స్థానిక సంస్థలను కూటమి ప్రభుత్వం బాగుచేసి జవసత్వాలు కల్పించాలని ఆయన కోరారు. ఆ సంఘం ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌కుమార్, సింగంశెట్టి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా..

తిరుపతి(విద్య), సెప్టెంబరు 13: రాష్ట్రంలో వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు శుక్రవారం కూడా అందాయి. కలెక్టరు వెంకటేశ్వర్‌కు పలువురు చెక్కులు, డీడీలు అందించగా.. ఆయన వారిని అభినందించారు.



- జిల్లాలోని ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ శాఖ, గ్రామ, వార్డు సచివాలయాల తరఫున అధికారులు, సిబ్బంది రూ.7,47,776 చెక్కును కలెక్టర్‌కు అందజేశారు.
- జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది తరఫున రూ.2,32,100 చెక్కును సెట్విన్ పథక సంచాలకులు జయలక్ష్మి, సిబ్బంది అందజేశారు.



- జిల్లా విద్యాశాఖ తరఫున రూ.లక్ష డీడీని అందించారు.
- చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలం దిగువ మాఘం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు ఎస్.మొగిలమ్మ రూ.51 వేలు.. రేణిగుంటలోని తపస్య ఇంగ్లిష్ మీడియం పాఠశాల తరఫున రూ.40 వేలు.. తిరుపతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు, సిబ్బంది రూ.27 వేలు.. సెట్విన్ కార్యాలయ సిబ్బంది రూ.పది వేలు అందజేశారు.

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032. నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవల్2),భవనం సంఖ్య 02,ఔరం ర్యూ పార్క్, జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,ఘన్సోలి,నవీ ముంబై-400710.

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీ పై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలం పాటను మేము దిగువ తెలిపిన తేదిన వేలం చేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యలు ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించుటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదిని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

వేలం వేయు తేది: 23.09.2024 వేలం వేయు చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఇం.నం.27-2-7, జి.ఎస్.టి రోడ్, పద్మావతి ప్లాజా, 3వ అంతస్తు, ఎ కె నగర్ నెల్లూరు-524004

లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు	లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు
GUDRBPJ2403020008	PARASMAL MANISH KUMAR	NKOTAPJ2403120005	VELURU VENKATESWARLU
GUDRBPJ2403120002	RUDRAKOTI SIVAKISHORE	NKOTAPJ2403130001	RAJASHEKAR RAJASHEKAR
GUDRBPJ2403120008	VADLAPUDI HANOCH	NKOTAPJ2403160001	BADDIGA ARUN
GUDRBPJ2403180002	PARASMAL MANISH KUMAR	NKOTAPJ2403220001	ROUTHU VENKAIAH
NDPETPJ2403010010	KATTA GANAGIAH	SLRPTPJ2403130001	JANAKIRAMAIAH VALLURU
NDPETPJ2403150002	THUMMALA CHAMUNDESWARI	SLRPTPJ2403130008	SUMANTH CHILAMATHURU
NDPETPJ2403200002	ANIL VASU PITHANI	SLRPTPJ2403160006	JYOSHNA NIMMALA
NDPETPJ2403230009	ANJALI NAGURAIAH	SLRPTPJ2403200001	RAVI KALETI
NKOTAPJ2403060005	BADDIGA ARUN	SLRPTPJ2403280002	KAVITHA KARUATHA
		SLRPTPJ2403280003	BUDURU SUBRAMANYAM

పైన ఉదహరించిన చిరునామాల వద్ద వేలం వేయడం జరుగుతుంది. వేలం సమయం:11.00 AM మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవడటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ P BABU ను సంప్రదించవచ్చు. సమయా భావముతో వేలము ఆ రోజు పూర్తి కానీ యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిసాయి.

తేది: 13.09.2024
స్థలం : నెల్లూరు

సం/- అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

తెలంగాణలో టీటీడీ కార్యక్రమాలు చేపట్టండి

● ఎమ్మెల్యే పాయల్ శంకర్ విజ్ఞప్తి



తిరుమల, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో టీటీడీ కార్యక్రమాలన్నీ మందగించాయని, ఈ విషయాన్ని గత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని తెలంగాణ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఆలయాలు, కల్యాణ మండ పాలు నిర్మించాలని భక్తులు కోరుతున్నారన్నారు. సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టితో గతంలో తరహాలో నిధులు వెచ్చించి ధార్మిక కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ధార్మిక కార్యక్రమాల నిర్వహణ విషయంలో గత ప్రభుత్వం చాలా నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబుపై తెలం గాణ ప్రజలకు చాలా విశ్వాసముందన్నారు. తిరిగి తెలంగాణాలోనూ ధార్మిక కార్యక్రమాల నిర్వహణ మొదలుపెట్టాలన్నారు. ఇక తిరుమల శ్రీవారి దర్శనానికి తెలంగాణ శాసనసభ్యుల సిఫార్సు లేఖలు తీసుకోవాలని సీఎం చంద్రబాబును కోరుతున్నానన్నారు.





కృపారాణి, డీకే అరుణ, అశ్వినీదత్

శ్రీవారిసేవలో... : శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని వస్తున్న కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, తెలంగాణ ఎంపీ డీకే అరుణ, సినీ నిర్మాత అశ్వనీదత్.

తిరుమల నాకు ఎప్పటికీ పుట్టినిల్లే: ఎల్వీ

తిరుమల, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): తనకు తిరుమల ఎప్పటికీ పుట్టినిల్లేనని మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం తెలిపారు. శ్రీవారి ఆలయం ముందు శుక్రవారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడారు. 1958వ బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి చల్లా భీమేశ్వరరావుతో శ్రీవారి దర్శనానికి వచ్చినట్టు తెలిపారు. భీమేశ్వరరావు గొప్ప దేశ భక్తుడన్నారు. అనేక మౌలికమైన అంశాలపై వ్యాసాలు, గ్రంథాలు రాస్తున్నారన్నారు. సనాతన ధర్మాన్ని నమ్ముతున్న వారందరికీ ఈక్షేత్రం ప్రధాన బిందువు అన్నారు. విజయవాడ వరద బాధితులందరూ తిరిగి కోలుకుని యథాస్థితికి రావాలని స్వామివారిని ప్రార్థించానన్నారు. తిరుమల క్షేత్రంలో ఈ మధ్య కాలంలో జరిగిన కొన్ని లోపాలను సరిదిద్దేందుకు ఈవో, అదనపు ఈవో అనేక కార్యక్రమాలపై ఆలోచనలు చేస్తున్నారని తెలియజేశారు. తనతో కొన్ని విషయాలు పంచుకుంటున్నారని తోచిన విధంగా తాను కూడా సహాయం అందిస్తూ సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని వివరించారు.

వికసిత్ ఆంధ్ర విజన్-2047పై పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

తిరుచానూరు, సెప్టెంబరు 13: తిరుచానూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'వికసిత్ ఆంధ్రవిజన్-2047' అనే అంశంపై మండలస్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వ్యాసరచన పోటీల్లో శ్రీకాళహస్తి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన పెంచల పూజిత మొదటిస్థానం, ఆర్‌సీపురం మండలం కమ్మకండ్రిగ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పార్థసారధి ద్వితీయ బహుమతి, సత్యవేడు బాలికల ఏపీడబ్ల్యూఆర్‌ఎస్‌కు చెందిన మహాలక్ష్మి తృతీయ స్థానం సాధించారు. వక్తృత్వ పోటీల్లో తిరుపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ కార్పొరేషన్ హైస్కూల్ విద్యార్థి వకుల హాసిని, శ్రీకాళహస్తి సరస్వతిబాయి పురపాలకసంఘ పాఠశాల విద్యార్థి ఎస్‌కే నసీహా, ఏర్పేడు మండలం బండారుపల్లి జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థి కృష్ణవేణి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. గెలుపొందిన విద్యార్థులను డీఈవో శేఖర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు ఏఎస్‌వో ధనంజయసారథి, ప్లానింగ్ కో-ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, ఏసీఎంవో రాము, ప్రధానపాధ్యాయులు మురళి పాల్గొన్నారు.

విత్తన ఉలవలను సద్వినియోగం చేసుకోండి



చిట్టేచెర్లలో ఉలవలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

భాకరాపేట, సెప్టెంబరు 13: ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేస్తున్న ఉలవ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలంలోని చిట్టేచెర్ల గ్రామంలో సబ్సిడీ విత్తనాలను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. అనంతరం పొలం పిలుస్తోంది పోస్టర్‌ను ఆవిష్క రించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జనార్దన్‌రాజు, ఎంపీడీవో సోమశేఖరరెడ్డి, వ్యవసాయ అధికారి ధనలక్ష్మి, ఉద్యానశాఖ అధికారి శివకుమారి, డీఎఫ్‌వో సతీశ్ కుమార్‌రెడ్డి, వైఎస్-ఎంపీపీ సునీత దామోదరం, సర్పంచ్ నాగచంగమనాయుడు, ఎంపీటీసీ విజయకుమారి, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళి, కార్యదర్శి మదనమోహన, తెలుగు మహిళా అధ్యక్షురాలు చిట్టెమ్మ, ఆర్వీ రమణారెడ్డి, మోహన్‌రెడ్డి, సహదేవరెడ్డి, సుబ్రహ్మణ్యం, కుమారస్వామిరెడ్డి, చిన్నయ్య, వెంకటరత్నం, కృష్ణమూర్తి, బెల్లకొండ రమణ, మల్లిఖార్జునరెడ్డి, గురుమూర్తి, చంద్రశేఖర్, చలపతి, లోకనాథం, చాంద్‌బాషా, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎర్రావారిపాళెం: మండలంలోని బోడేవాండ్లపల్లె రైతు సేవా కేంద్రంలో రైతులకు ఉలవ విత్తనాలను ఎమ్మెల్యే పులివర్తి నాని పంపిణీ చేశారు. అనంతరం 'పొలం పిలు స్తోంది' పోస్టర్లను ఆవిష్కరించారు. తహసీల్దార్ పరమేశ్వరస్వామి, ఏవో ఖాదర్ బాషా, టీడీపీ మండల అధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ, సర్పంచ్ మధు సూదన్‌రెడ్డి, కూటమి నాయకులు మహేష్‌నాయుడు, చిన్నప్పరెడ్డి, మధుసూదన్, అశోక్‌రెడ్డి, వేణు, జడ్పీటీసీ కరుణాకర్ పాల్గొన్నారు.

జనసేన నాయకుడికి పరామర్శ

ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై పసుపులేటి వారిపల్లెలో తన ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న జనసేన మండల అధ్యక్షుడు ముండ్లపాటి మురళిని ఎమ్మెల్యే పరా మర్శించారు.

తుమ్మలగుంటలో పవిత్రోత్సవాలకు అంకురార్పణ



ఊరేగింపుగా బయలుదేరిన విష్వక్సేనుడు

తిరుపతిరూరల్, సెప్టెంబరు13: తుమ్మలగుంటలోని కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలకు శుక్రవారం రాత్రి అంకురార్పణ జరిగింది. మూడురోజుల పాటు ఈ పవిత్రోత్సవాలు జరగనున్నాయి. శనివారం రోజున ఆలయంలో పవిత్ర ప్రతిష్ఠ, ఆదివారం పవిత్రమాలలు ఊరేగింపు, పవిత్ర సమర్పణ చేస్తారు. చివరిరోజు సోమవారం పూర్ణాహుతితో ఈ ఉత్సవాలను ముగిస్తారు. ఇందులో భాగంగా ఉదయం మూలవిరాట్టు వద్ద ఆచార్య రుత్విక్‌వరణం నిర్వహించారు. సాయంత్రం విష్వక్సేనుడిని గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్లి వినాయకుడి ఆలయంలో మృత్సంగ్రహణం, ఆస్థానం నిర్వహించారు. ఆ తర్వాత ప్రధాన ఆలయం వద్దకు చేరుకుని పవిత్ర మండపంలో అంకురార్పణకి సంబంధించిన వైదిక క్రతువులు చేపట్టారు. చెవిరెడ్డి రఘునాథరెడ్డి, మంజుల దంపతులు కంకణధారణ చేశారు. ఈవో సుబ్రమణ్యంరెడ్డి, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్త ఇంటిపై దాడి

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 13: నగరంలో శుక్రవారం జనసేన కార్యకర్త ఇంటిపై దాడి చేయడంతో అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రాంకిషోర్ వివరాల మేరకు... శెట్టిపల్లికి చెందిన చరణ్ జనసేన పార్టీ కోసం ప్రారంభం నుంచి పనిచేస్తున్నాడు. ఇది గిట్టని అదే ప్రాంతానికి చెందిన మహేష్, చందు శుక్రవారం అతని ఇంటిపై రాళ్ల దాడి చేశారు. చరణ్ అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ రాం కిషోర్ కేసు నమోదు చేసి, మహేష్, చందులను స్టేషన్‌కు పిలిపించి విచారించారు.

నులి పురుగులను నిర్మూలిద్దాం

తిరుపతిరూరల్, సెప్టెంబరు13: నులిపురుగులను నిర్మూలిద్దామని ఎంపీడీవో రమేష్ బాబు పిలుపునిచ్చారు. 20వ తేదీన నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమ పోస్టర్‌ను శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దామినేడు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుకన్య, ఎంఈవో-1 దేవరాజులురెడ్డి, ఎంపీ హెచ్‌ఈవో శ్రీనివాసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పార్కింగ్ ప్రాంతాల కోసం కార్యాచరణ



బూందీ పోటును పరిశీలిస్తున్న ఈవో

● శ్రీవారి బ్రహ్మోత్సవాల సమీక్షలో టీటీడీ ఈవో

తిరుమల, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా వాహనాల పార్కింగ్ ప్రాంతాల కోసం కార్యచరణ సిద్ధం చేసుకోవాలని టీటీడీ ఈవో శ్యామలరావు అన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పురోగతిపై అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి వివిధ శాఖల అధికారులతో ఈవో సమీక్షించారు. ప్రస్తుతమున్న ఉన్న ప్రాంతాల్లో దాదాపు 11 వేల వాహనాల పార్కింగ్‌కు సరిపోతాయన్నారు. అదనపు పార్కింగ్ కోసం ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు, బందోబస్తు, అదనపు సిబ్బంది, సీసీటీవీ, అదనపు లగేజీ సెంటర్ల ఏర్పాట్ల కోసం స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. వివిధ శాఖల పనులపై సమీక్షించారు. అంతకుముందు లడ్డూ కాంప్లెక్స్ లడ్డూ బూందీ తయారీ కేంద్రాన్ని సందర్శించారు. లడ్డూల పంపిణీ, బూందీ తయారీ ప్రక్రియను పర్యవేక్షించి శ్రీవారిపోటుపై సేఫ్టీ ఆడిట్ చేపట్టాలని అధికారులను ఈవో ఆదేశించారు. మాడవీధుల్లో బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. సీఈ సత్యనారాయణ,ఆలయ డిప్యూటీఈవో లోకనాథం, ఈఈ1 సుబ్రహ్మణ్యం, రవాణా విభాగం జీఎం శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష ఆయన శ్వాస

● స.వెం. రమేశ్‌కు నేడు బొమ్మిడాల పురస్కారం



ఆయన పుట్టి పెరిగింది తమిళనాట. కానీ జన్మమూలాల అమ్మభాష అయిన తెలుగే శ్వాసగా తపిస్తున్నారు. భాషా రాష్ట్రాల పేరుతో తెలుగు భాష, సంస్కృతులకు కలిగిన ముప్పును వివరిస్తూ, కాపాడుకుందామంటూ ఉద్యమకారుడిగా అలుపెరగని ప్రయాణం సాగిస్తున్నారు. ఎల్లలకు ఆవల ఉన్న తెలుగుదనాన్ని లోకానికి చాటుతున్నారు. తెలుగు పరిశోధకుడిగా దేశదేశాలు పర్యటిస్తున్నారు స.వెం.రమేశ్. ఆయన చేస్తున్న విశేష కృషికి గుంటూరుకు చెందిన బొమ్మిడాల కృష్ణమూర్తి ఫౌండేషన్ అత్యున్నత పురస్కారాన్ని ప్రకటించింది. శ్రీకాళహస్తి కేంద్రంగా చేసుకుని ప్రస్తుతం తెలుగు భాషోద్యమం నడుపుతున్న స.వెం.రమేశ్‌కు గుంటూరులో నేటి సాయంత్రం జరిగే ప్రత్యేక సభలో బొమ్మిడాల పురస్కారం అందజేస్తారు.

గురువు పుష్పరాజ్ సహా ఏడుగురితో ఏర్పడిన తెలుగువాణి సంస్థ ద్వారా స.వెం.రమేశ్ తమిళనాడులోని వేలూరు ప్రాంతంలో తెలుగు తరగతులను ప్రారంభించారు. అనేక తెలుగు పల్లెల్లో తిరిగి తెలుగు రాయడం చదవడం నేర్పించారు. వేలూరు పరిసరాల్లోని 80 గ్రామాల్లో నాలుగు వేల మంది తెలుగు నేర్చుకున్నారు. వారిలో కొందరు తెలుగులో కథారచయితలుగా, కవులుగా మారారు. ఆ తరువాత కంచి, హోసూరు, తిరవళ్లూరు తదితర ప్రాంతాల్లో తెలుగు ఉద్యమాన్ని నడిపించి అక్కడి భాషాభిమానుల్లో ఉత్తేజం నింపారు. ఇక ప్రపంచ నలుమూలల్లోని తెలుగువారి మూలాల కోసం ఆయన అన్వేషణ కొనసాగింది. శ్రీలంక దేశంలో పాములు, కోతులు ఆడించే రెండు తెగల ప్రజలు తెలుగువారు ఉన్నట్లు గుర్తించి వారి దగ్గరకు వెళ్లి వారి జీవన సంస్కృతులు అధ్యయనం చేశారు. వారి తెలుగు మూలాలు వెలుగులోకి తెచ్చారు. అలాగే బంగ్లాదేశ్‌లోని వందలాది మారుమూల పల్లెల్లో సుమారు 6.5లక్షల మంది తెలుగువారు ఉన్న విషయం వెలుగులోకి తెచ్చారు. ఇక అమెరికా, మలేసియా, మారిషస్ దేశాల్లో కూడా ఆయన పర్యటించి తెలుగు భాషపై లోతైన పరిశోధన చేశారు. 200 ఏళ్ల క్రితం మలేషియాలో స్థిరపడ్డ తెలుగువారు నేటికీ గెంతు, దాటు భజనలు, కోలాటాలు, బుర్రకథలు పదిలంగా కాపాడుకోవడం గుర్తించారు. రచయితగానూ ఆయన రాసిన పుస్తకాలు అచ్చతెలుగు అక్షరాలతో అల్లిన పరిమళ దండలు. భాషాభిమానులను ఎంతగానో పెనవేసుకున్నాయి. ఇందులో ప్రధానంగా పులికాట్ తీర ప్రజల జీవన విధానాన్ని కళ్లకు కట్టిన 'ప్రళయ కావేరి కతలు' పుస్తకం, 'కతల గంప' విశేషంగా తెలుగు పాఠకులను ఆకట్టుకున్నాయి. ఎల'లు లేని తెలుగు' వ్యాసాల పుస్తకం, 'సజీవ సాంప్రదాయంగా వేమన' పరిశోధన పుస్తకం, వ్యాకరణంపై తెలుగు నుడికట్టు పుస్తకం స.వెం.రమేశ్ సాహిత్య, భాషా కృషిని వెల్లడిస్తాయి.

- శ్రీకాళహస్తి



ప్రసంగిస్తున్న ఎల్వీ సుబ్రహ్మణ్యం

సనాతన హైందవ ధర్మానికి వేదవిద్యార్థులు సంరక్షకులు

● మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం

తిరుమల, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): వేదవిద్యార్థులు సనాతన హిందూ ధర్మ సంరక్షకులుగా వ్యవహరించి సంస్థ ఖ్యాతిని వ్యాప్తి చేయాలని మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం ఉద్బోధించారు. తిరుమల ధర్మగిరి వేదవిజ్ఞానపీఠంలో శుక్రవారం జరిగిన గణేష నవాహ్నిక ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఒకటిన్నర శతాబ్దంగా గొప్ప విద్యాకేంద్రంగా వేదరంగంలో ఎందరో ప్రముఖులను తయారు చేసిన ఈ సంస్థ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడం విద్యార్థుల బాధ్యతన్నారు. విద్యార్థులకు యోగా, ధ్యానంతో పాటు క్రీడా సముదాయం ఏర్పాటు చేయనున్నట్టు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. అనంతరం వీర గణపతి ఉత్సవ పూజల్లో పాల్గొన్నారు. ధర్మగిరి ప్రిన్సిపాల్ అవధాని, వీఎస్‌వో సురేంద్ర, వేద అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.37 కోట్లు

తిరుమల, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.37 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించారు. ఈమేరకు రూ.3.37 కోట్ల ఆదాయం లభించినట్టు టీటీడీ శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక గురువారం 63,544 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 22,942 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

వెటర్నరీ వర్సిటీలో తాత్కాలిక ఆఫీసర్ల నియామకానికి ఆమోదం

తిరుపతి రూరల్, సెప్టెంబరు 13: ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో ఆఫీసర్ల పోస్టులకు సీనియారిటీ ప్రాతిపదికన తాత్కాలికంగా నియామకాలు చేపట్టేందుకు శుక్రవారం అమరావతిలోని సెక్రటేరియట్‌లో నిర్వహించిన వర్సిటీ పాలకమండలి సమావేశంలో ఆమోదించారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జేవీరమణ అధ్యక్షతన నిర్వహించిన పాలకమండలిలో పలు అంశాలకు ఆమోదం తీసుకున్నారు. వర్సిటీలో ఖాళీగా ఉన్న రిజిస్ట్రార్, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్, డెయిరీ సైన్స్ డీన్ పోస్టులను 6నెలల కాలానికి తాత్కాలిక ప్రాతిపదికన నియమించేందుకు అనుమతి పొందారు. డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్(డీఆర్) పోస్టుకు రాటిఫికేషన్‌తో పాటు ప్రభుత్వం విడుదల చేసిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్(రెండుస్పెల్స్)కి, పెన్షనర్లు, ఉద్యోగులకు డీఏ అరియర్స్‌కు ఆమోదం, టైంస్కేల్ ఉద్యోగులకు పెరిగిన డీఏని వర్తింపజేసేందుకు అనుమతి తీసుకున్నట్లు తెలిసింది. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ చెంగల్వరాయులు, ఎక్స్‌అఫిషియో సభ్యులు పాల్గొన్నారు. కాగా సీనియారిటీ జాబితా ప్రకారం వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా గన్నవరం వెటర్నరీ కళాశాల పార్మకాలసీ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్, డీఈగా ప్రొఫెసర్ డాక్టర్ శోభామణిలను నియమించనున్నట్లు సమాచారం.



ఊంజల్‌పై పద్మావతిదేవి సాక్షాత్కారం

తిరుచ్చిపై పద్మావతి దేవి అభయం

తిరుచానూరు, సెప్టెంబరు: తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారు శుక్రవారం రాత్రి బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. ఉదయం కల్యాణోత్సవం, లక్ష్మీపూజ వేడుకగా జరిగింది. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవమూర్తిని ఫ్రైడే గార్డెన్‌కు వేంచేపు చేసి అర్చకులు తిరుమంజనం నిర్వహించారు. అలంకార శోభితురాలైన పద్మావతి దేవికి తిరువీధి ఉత్సవం వేడుకగా జరిగింది. పద్మావతి అమ్మవారి ఊంజల్‌సేవలో తాను రచించి స్వరపరిచిన రావమ్మా వరలక్ష్మీ కావంగ మాలక్ష్మి అంటూ అమ్మవారిని కీర్తిస్తూ డాక్టర్ శోభారాజ్ సంకీర్తన భక్తులను అలరించింది. తగునయ్యా హరి నీకు అంటూ ఆమె శిష్యులు గాయత్రి వేదుల, రన్వితారెడ్డి కలిసి పలు అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. వాయిద్య సహకారం కల్యాణ్ పాండు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, ఏవీఎస్‌వో సతీష్‌కుమార్, అర్చకుడు బాబుస్వామి, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, శేషగిరి, ప్రసాద్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.



అమ్మవారి ఊంజల్ సేవలో గాత్రకచేరి చేస్తున్న శోభారాజ్

భాకరాపేట ఘాట్‌లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టండి



ప్రమాదానికి గురైన కారును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, సెప్టెంబరు 13: భాకరాపేట ఘాట్ రోడ్డులో ప్రమాదాల నివారణకు వెంటనే చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే పులివర్తి నాని అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి పోలీసులు, జాతీయ రహదారుల అధికారులతో కలిసిన భాకరాపేట ఘాట్ రోడ్డులో ప్రమాదాలు జరిగే ప్రధానమైన మలు పులను పరిశీలించారు. ప్రమాదాలు జరిగేందుకు కారణాలు, నివారణకు తీసుకోవలసిన చర్యలు గురించి అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురువారం జరిగిన రోడ్డు ప్రమాదం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. సీ.మల్లవరం జంక్షన్ నుంచి పీలేరు వరకు బైపాస్ రోడ్డు పూర్తయితే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని అధికారులు తెలిపారు. కొందరు భూ యజమానులు అధిక మొత్తం పరిహారం కోసం కోర్టును ఆశ్రయించడంతో రహదారి పెండింగ్‌లో ఉందని తెలియజేశారు. అలాగే అటవీ శాఖ నుంచి అనుమతులు లభించాల్సి ఉందని వివరించారు. అనుమతులు త్వరితగతిన మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తిరుపతి డీఎఫ్‌ఓ సతీష్‌కుమార్‌ని ఎమ్మెల్యే కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చంద్రగిరి, సెప్టెంబరు 13: మండల పరిధిలో విద్యుత్ సరఫరాలో తలెత్తే సమస్యల పరిష్కారం కోసం శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తిరుపతి రూరల్ ఈఈ ఎన్.వాసురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

హెచ్‌ఐవీపై అవగాహన ఉండాలి



హెచ్‌ఐవీపై అవగాహన ర్యాలీ

ఎర్రావారిపాళెం, సెప్టెంబరు 13: హెచ్‌ఐవీపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని కోర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి తులసి తెలియజేశారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు హెచ్‌ఐవీ వ్యాప్తి, నివారణ చర్యలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యం కంటే విలువైనది ఏదీ లేదన్నారు. డబ్బు ఎంత ఉన్నా ఆరోగ్యం సరిగా లేకుంటే ఉపయోగం లేదన్నారు. రక్తమార్పిడి, సిరంజీల ద్వారా హెచ్‌ఐవీ వ్యాప్తిచెందే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల వాటి వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది



మాట్లాడుతున్న సీడీపీవో జయలక్ష్మి

రామచంద్రాపురం, సెప్టెంబరు 13: పౌష్టికాహారంతోనే పిల్లల్లో వ్యాధి నిరోధకత పెరుగుతుందని సీడీపీవో జయలక్ష్మి తెలిపారు. పోషకాహార వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని కుప్పంబాదూరు ఉన్నత పాఠశాలల్లో శిశు, మహిళా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహార ప్రాము ఖ్యతపై ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు, చిన్నారులు అంగన్వాడీల్లో క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి సీడీపీవో ప్రదీప, ప్రధానో పాధ్యాయురాలు సృజనకుమారి తదితరులు పాల్గొన్నారు.



గజ వాహనంపై సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడు

గజ వాహనంపై ఏకదంతుడు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 13: కాణిపాక వరసిద్ధి వినాయకుడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు గజ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శమిచ్చారు. కాణిపాకానికి చెందిన వన్నియ నాయకర్ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఉదయం మూల విరాట్‌కు ఉభయదారుల ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించారు. రాత్రి ఉభయ వరస రావడంతో ఆలయ అలంకార మండపంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు విశేష పూజలు చేసి,భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను భక్తి శ్రద్ధలతో గజ వాహనంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో గురుప్రసాద్, ఏఈవోలు విద్యాసాగర్‌రెడ్డి, ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రవి, ఉభయదారులు పాల్గొన్నారు. శనివారం స్వామికి రథోత్సవాన్ని(తేరు) నిర్వహించనున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



తిరుపతి అర్బన్, సెప్టెంబరు 13: నగర పరిధిలోని ఉప్పరపాళెం పంచాయతీ(నారాయణాద్రి హాస్పిటల్ ఎదురుగా)లో నివాసాల మధ్య విద్యుత్ స్తంభం కూలిపోయే స్థితిలో ఉంది. 30ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ స్తంభం మరమ్మతులకు గురై ఏటవాలుగా వాలిపోయింది. ఈదురుగాలులతో కూడిన వర్షం వస్తే తప్పకుండా కూలిపోతుందని స్థానికులు చెబుతున్నారు. మార్చాలని విద్యుత్ అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

మందుల కొనుగోళ్లపై విచారణ చేపట్టాలి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 13: ఎస్వీయూ ఆరోగ్య కేంద్రం మందుల కొనుగోళ్లలో గోల్‌మాల్ జరిగిందని, దీనిపై ఉన్నత స్థాయి కమిటీ వేసి విచారణ చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. గత ఐదేళ్లలో వైద్యుల పర్యవేక్షణలోనే మందుల కొనుగోళ్లలో అవినీతి జరిగిందని తెలిపారు. మూడు ఫార్మసీ కంపెనీలతో లోపాయికారీ ఒప్పందం చేసుకుని రూ.40 లక్షల విలువ చేసే నాసిరకం మందులు కొనుగోలు చేశారని వివరించారు. ఏటా రూ.20 లక్షల విలువ గల మందులు వృథా అవుతున్నాయని పేర్కొన్నారు. విచారణ చేపట్టి బాధ్యులైన వారిని తొలగించాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

అకడమిక్ కన్సల్టెంట్ల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వండి



అధికారులకు విన్నవిస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 13: ఎస్వీయూలో అకడమిక్ కన్సల్టెంట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని టీఎన్ఎస్ఎఫ్ విన్నవించింది. ఈ మేరకు ఇన్‌చార్జి వీసీ అప్పారావుకు యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్కే నాయుడు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గత పాలనలో నిబంధనలకు విరుద్ధంగా 124 మందిని తీసుకున్నారని, వీరిని తొలగించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నేతలు శ్రీరాం, రవి, రామాంజినేయులు పాల్గొన్నారు.

పాకాల రైల్వేస్టేషన్‌కు మహర్దశ

ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

ఆటోనగర్(తిరుపతి) : పాకాల రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టనుందని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.పాకాల స్టేషన్‌ను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో కొత్త రైల్వే కోచ్ డిపో ఏర్పాటు చేయాలని, ఆధునికీకరించాలని ప్రతిపాదనలను కేంద్ర రైల్వేశాఖ మంత్రికి తాను సమర్పించానన్నారు. తన విజ్ఞప్తి మేరకు కేంద్ర రైల్వేశాఖ.. పాకాల రైల్వేస్టేషన్ పరిసరప్రాంతాల్లో ఎనిమిదిలైన్ల రైల్వేమార్గంతోపాటు కొత్త రైల్వే కోచ్ డిపోను నిర్మించేందుకు ఈ నెల 9న నిర్వహించిన సేఫ్టీ మీటింగ్‌లో సూత్రపాయంగా ఆమోదం తెలిపిందన్నారు. వచ్చే ఏడాది మార్చి నుంచి పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

నులి పురుగుల నివారణ మాత్రలు అందించండి



నులిపురుగుల నివారణపై పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

రామచంద్రాపురం, సెప్టెంబరు 13: నులిపురుగుల నివారణ మాత్రలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు తప్పకుండా అందించాలని ఎంపీడీవో శ్రీనివాసులు సూచించారు. నులిపురుగుల నివారణ పోస్టర్లను శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ మధ్యాహ్నం భోజనం తరువాత పిల్లలకు మాత్రలను ఇవ్వాలన్నారు. ఎంఈవోలు మార్కొండయ్యానాయుడు, జయవేలు, వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చంద్రగిరి: చంద్రగిరిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో కొటాల పీహెచ్‌సీ వైద్యాధికారి డా. బీకుసుమ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల దినోత్సవం పోస్టర్లను ఆవిష్కరించారు. ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో భాస్కర్‌బాబు, అన్నిశాఖల అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆదమరిస్తే ఆస్పత్రికే..



తిరుమల బైపాస్ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న గుంత

తిరుపతి(లీలామహల్), సెప్టెంబరు 13: తిరుమల బైపాస్ రోడ్డులోని అలిపిరి పోలీస్‌స్టేషన్ సమీపంలో గుంత ప్రమాదకరంగా ఉంది. గతంలో ఫుట్‌పాత్ ఏర్పాటు సమయంలో కేబుల్స్ అమరిక కారణంగా కొంతవరకు వదిలేశారు. ఆ తర్వాత దాని గురించి పట్టించుకోలేదు. రాత్రిపూట పాదచారులు అదుపుతప్పి పడిపోతున్నారు. వాహనాలు అదుపుతప్పితే పెద్దప్రమాదమే జరిగే అవకాశం ఉంది. గుంతకు రక్షణ ఏర్పాట్లు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

సంతాప సభను విజయవంతం చేయండి

తిరుపతి(విద్య), సెప్టెంబరు 13: గిరిజనుల సంక్షేమం కోసం అహర్నిశలూ పాటుపడిన నాయకుడు బాణావత్ గుండాల నాయక్ సంతాప సభను విజయవంతం చేయాలని గిరిజన సంఘం నేతలు కోరారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఉమ్మడి జిల్లా గిరిజన సంక్షేమ సంఘం ఛైర్మన్ బి.వెంకటరమణ నాయక్ మాట్లాడుతూ ఆదివారం బైరాగి పట్టెడలోని గిరిజన భవన్‌లో నిర్వహించే ఈ కార్యక్రమంలో పార్టీలకతీతంగా పాల్గొనాలని కోరారు.

రోడ్డు మధ్యలో అడ్డు తొలగింపు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 13: మంగళం కూడలిలో రోడ్డుకు అడ్డుగా ఉన్న మట్టి, రాళ్లను తొలగించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'ఆగిన వీధిలైట్ల అమరిక' కథనంపై స్పందించిన సంబంధిత విభాగం అధికారులు ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తున్న మట్టి, రాళ్ల, ఇతర వ్యర్థాలను తొలగించారు.

రేపు ఛాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశం



మాట్లాడుతున్న మోహన్‌కుమార్‌రాజు

తిరుపతి (విద్య), సెప్టెంబరు 13: తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ 15వ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం రామతులసి కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు మోహన్ కుమార్‌రాజు తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లోని 36 వ్యాపార సంఘాల వారు తప్పకుండా హాజరు కావాలని కోరారు. తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, ఎంపీ గురుమూర్తి తదితరులు హాజరుకానున్నారని చెప్పారు.

ఏచూరి మృతికి మాజీ వీసీ సంతాపం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 13: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతిపట్ల ఎస్వీయూ మాజీ వీసీ మురళి సంతాపం వ్యక్తం చేశారు. ఎస్వీయూతో ఏచూరికి ఎంతో అనుబంధం ఉందని గుర్తు చేశారు. పీడిత ప్రజల కోసం జీవితాంతం కృషి చేసిన ఏచూరి దేశ చరిత్రలో యోధుడిలా నిలిచిపోతారని కొనియాడారు. ఏచూరి కుటుంబ సభ్యులకు ఒక ప్రకటనలో సానుభూతి తెలిపారు.

తిరుపతి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

తిరుపతి (ఆటోనగర్),సెప్టెంబరు13 : డివిజన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తిరుపతి టౌన్ ఈఈ కె.వాసుదేవ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎల్‌వీ నగర్, రాజీవ్‌గాంధీ కాలనీ, శ్రీనగర్‌కాలనీ, రాఘవేంద్రనగర్, శివజ్యోతినగర్, ఉపాధ్యాయనగర్, జీవకోన, క్రాంతి నగర్, భవానీనగర్, కొర్లగుంట, వినాయకనగర్, తుడారోడ్డు, తిలక్ రోడ్డు, రైల్వే కాలనీ, సుందరయ్యనగర్, రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, వీవీ మహల్ రోడ్డు, తీర్థకట్ట వీధి, కేకే లేఅవుట్, మధురానగర్ ప్రాంతాలలో అంతరాయం ఉంటుందని వెల్లడించారు.

రూ.62.5లక్షల ఎర్రచందనం స్వాధీనం

నలుగురు స్మగ్లర్ల అరెస్టు

మంగళం, సెప్టెంబరు 13: నంద్యాల జిల్లా చాబోలు మార్గం వద్ద గురువారం టాస్క్‌ఫోర్సు పోలీసులు రూ.62.5లక్షల విలువ గల 54 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. మినీ లారీని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ పర్యవేక్షణలో కడప రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ చిరంజీవులు, నరేష్ బృందాలు చాబోలు మార్గం వద్ద కర్నూలు-కడప రహదారిపై గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. కర్నూలు వైపు నుంచి వస్తున్న మినీలారీని ఆపే ప్రయత్నం చేయగా డ్రైవర్ వాహనాన్ని ఆపి పారిపోయేందుకు యత్నించాడు. పోలీసులు వెంబడించి నలుగురిని పట్టుకున్నారు. వాహనంలో తనిఖీ చేయగా 54 ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు రాజస్థాన్, హైదరాబాద్, ప్రకాశం జిల్లాలకు చెందిన వారుగా గుర్తించారు. వాహనం సహా దుంగల విలువ రూ.62.50లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. వాటిని తిరుపతి టాస్క్‌ఫోర్సు కార్యాలయానికి తరలించి సబ్ ఇన్‌స్పెక్టర్ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

టీడీపీతోనే ఉపాధి అవకాశాలు



మహిళా కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 13: టీడీపీ ప్రభుత్వంలోనే ఉపాధి అవకాశాలు లభిస్తాయని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం కరకంబాడి రోడ్డులోని రామచంద్రనగర్‌లో వినూత్నంగా ఏర్పాటు చేసిన ఏ టూ జెడ్ ఎక్వాటిక్ పార్కు, రెస్టారెంటును ఆయన టీడీపీ నేత డాలర్ దివాకర్‌రెడ్డితో కలసి ప్రారంభించారు. హోటల్లో పనిచేస్తున్న కొందరు మహిళలతో నాని ముచ్చటించారు. టీడీపీ అధికారంలోకి రాగానే మంగళం పంచాయతీ పరిధిలోని 35 మంది మహిళలకు హోటల్లో ఉపాధి లభించిందని తెలిపారు. అనంతరం పార్కులోని వివిధ రకాల పక్షులు, జంతువులు, విదేశీ జీవరాశులను పరిశీలించి అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. స్థానిక నాయకులు కొన్ని సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు వేమూరు మధు, ఈశ్వరయ్య, గోపీనాథ్, చిన్నరెడ్డిబాబు, మల్లెల నాగరాజు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో డే కేర్ సెంటర్ ప్రారంభం



డే కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి వీసీ ఉమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 13: మహిళా వర్సిటీ హోంసైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న డే కేర్ సెంటర్‌ను శుక్రవారం ఇన్‌చార్జి వీసీ ఉమ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వర్సిటీలో చదువుకుంటున్న విద్యార్థినులు, ఉద్యోగం చేస్తున్న మహిళల సౌకర్యార్థం ఈ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బోధన, పరిశోధనలతో పాటు విస్తరణ రంగంలోనూ యూనివర్సిటీ కృషి చేస్తోందన్నారు. రిజిస్ట్రార్ రజని మాట్లాడుతూ డే కేర్ సెంటర్ నిర్వహణకు అన్ని విధాలా సహకరిస్తామన్నారు. డీన్లు సుజాతమ్మ, వాణి, హోంసైన్స్ హెడ్ బిందు, నర్సింగ్, ఇంజనీరింగ్ కాలేజీల ప్రిన్సిపాళ్లు గంగాభవాని, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి రూ.25 వేల విరాళం



అధికారులకు వివరాలు అందజేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 13: వరద బాధితుల సహాయార్థం ఎస్వీయూ అకడమిక్ కన్సల్టెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ రూ.25 వేల విరాళం అందించింది. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎంసీ ఓబులేసు నేతృత్వంలో కొన్ని రోజులుగా యూనివర్సిటీలో ఈ విరాళాన్ని సేకరించారు. శుక్రవారం సీఎం సహాయ నిధికి పంపి, ఇందుకు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కన్సల్టెంట్లు డాక్టర్ దబ్బర రమణ (ఉమెన్ స్టడీస్), డాక్టర్ తిమ్మప్ప (హిస్టరీ), డాక్టర్ మల్లికార్జున (పొలిటికల్ సైన్స్) పాల్గొన్నారు.





భువన్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న అసోసియేషన్ నేతలు - అన్నదానం చేస్తున్న ఆర్సీ మునికృష్ణ, చిన్నబాబు

అన్నదానం

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 13: వినాయక చవితి పండుగలో భాగంగా నిమ్మకాయల వీధి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం చేశారు. టీడీపీ నేత భువన్‌కుమార్‌రెడ్డి, జనసేన నేత పొలకల మల్లికార్జున్ ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.

27వ డివిజన్‌లో..

27వ డివిజన్ ఎంజీకట్ట వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ నగర అధ్యక్షుడు చిన్నబాబు హాజరయ్యారు. ఉత్సవ కమిటీ సభ్యులు శంకర్, సాయికుమార్, హరి, సుబ్రహ్మణ్యం, నాయకులు భరణియాదవ్, నాగప్రతాప్, మునిరాజా, రమేష్‌రెడ్డి, దేవ ఆచారి పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం నిత్యావసరాలు



బస్సును ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 13: విజయవాడ వరద బాధితుల కోసం నిత్యావసర సరుకులతో కూడిన బస్సు శుక్రవారం బయలుదేరి వెళ్లింది. ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. 300 కుటుంబాలకు సరిపడ నిత్యావసరాలు ఈ బస్సులో పేర్చారు. జాయింట్ రిజిస్ట్రార్ చంద్రయ్య, నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గుర్రంకొండ శ్రీధర్, నెల్లూరు సుబ్రమణ్యం, నాయకులు కోటగారం మురళి, రమేష్‌బాబు, చంద్రశేఖర్ నాయక్, లీలాకృష్ణరెడ్డి, హరి, జయచంద్రబాబు పాల్గొన్నారు.

నులి పురుగుల నిర్మూలనకు కృషి

తిరుపతి(విద్య), సెప్టెంబరు 13: జిల్లాలో ఈనెల 17న నిర్వహించనున్న నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్య, విద్య, మహిళా శిశు సంక్షేమ శాఖాధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం ఆయన డీఆర్వో పెంచల కిషోర్‌తో కలిసి కలెక్టరేట్ నుంచి వర్చువల్‌గా అధికారులతో సమావేశమయ్యారు. అల్బెండజోల్-400 మాత్రలను ఈనెల 15 నాటికి విద్యాసంస్థలకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి, రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం ప్రాజెక్ట్ అధికారిణి డాక్టర్ పద్మావతి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి జయలక్ష్మి, డీఈవో శేఖర్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి చన్నయ్య పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే లైసెన్సు రద్దు



దుకాణదారులతో చర్చిస్తున్న ఏటీఎం

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 13: ఏపీఎస్ ఆర్టీసీ నిబంధనలు పాటించని దుకాణాల లైసెన్సు రద్దు చేస్తామని సెంట్రల్ బస్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు హెచ్చరించారు. శుక్రవారం బస్టాండు కార్యాలయంలో దుకాణాల నిర్వాహకులతో ఆయన సమావేశమయ్యారు. ఎమ్మార్పీకే విక్రయించాలని, శుభ్రత పాటించాలని, నిషేధిత వస్తువులు విక్రయించరాదని, కేటాయించిన స్థలంలోనే వ్యాపారం చేసుకోవాలని సూచించారు. నెలవారి బాడుగలు సకాలంలో చెల్లించాలన్నారు. అసిస్టెంట్ మేనేజర్ పద్మావతి, సూపర్‌వైజర్లు సత్యనారాయణ, రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

కాన్సర్ బాధితుడికి నందమూరి ఫ్యాన్స్ డాట్ కాం చేయూత



తిరుపతి(విద్య), సెప్టెంబరు 13:క్యాన్సర్‌తో బాధపడుతూ ఆర్థిక సమస్యల కారణంగా చికిత్స చేయించుకోలేక... రోజురోజుకూ మరణానికి దగ్గరౌతున్న ఓ యువకుడికి నందమూరి ఫ్యాన్స్ డాట్ కాం ఆర్థికసాయం అందించింది. జూనియర్ ఎన్టీఆర్ వీరాభిమాని, తిరుపతికి చెందిన పందొమ్మిదేళ్ల యువకుడు కౌశిక్ కాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని 'దేవర సినిమాచూసి చచ్చిపోతా.. అమ్మా అప్పటిదాకా బతికించండి' శీర్షికన ఆంధ్రజ్యోతి శుక్రవారం ఓ కథనాన్ని ప్రచురించింది.స్పందించిన నందమూరి ఫ్యాన్స్ డాట్ కాం వెబ్‌సైట్ ప్రతినిధులు బాధితుడి ఇంటికి చేరుకుని 40వేల రూపాయల నగదును కౌశిక్ తల్లిదండ్రులకు అందజేశారు. నందమూరి హీరోల అభిమానులు కొంతమంది నందమూరి ఫ్యాన్స్ డాట్ కాం పేరున ఓ వెబ్‌సైట్‌ను కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నారు. ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారిని గుర్తించి వీరు ఆపన్న హస్తం అందిస్తున్నారు.ఈ క్రమంలో అనేక మంది విద్యార్థులకు ఫీజులు చెల్లించడం, పుస్తకాలు కొనివ్వడం, పేదవారికి ఆర్థికసాయం అందించడం లాంటి సేవలు అందిస్తున్నారు.

నేడు జూనియర్ ఎన్టీఆర్ పరామర్శ

కౌశిక్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న హీరో జూనియర్ ఎన్టీఆర్ శనివారం అతడిని పరామర్శించనున్నారు.తిరుపతికి చెందిన తన అభిమాని కృష్ణయాదవ్‌కు ఫోన్ చేసి కౌశిక్ దగ్గరకు వెళ్లి తనతో ఫోన్లో మాట్లాడించమని చెప్పినట్లు సమాచారం.

కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలి

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 13 : వైద్యశాఖలో డీఎస్సీ ద్వారా ఎంపికై 20 ఏళ్లుగా కాంట్రాక్టు కింద పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేసేందుకు సహకరించాలని రుయాస్పత్రి లోని కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజాను కోరారు. ఈ మేరకు రుయాస్పత్రిలో శుక్రవారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందించారు. 20 ఏళ్లుగా అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ సేవలను రోగులకు అందించడంతోపాటు కొవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లోనే ప్రాణాలకు తెగించి సేవలందించామన్నారు. ప్రభుత్వాలు మారినా తమ రెగ్యులర్ విషయం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని రాజా వారికి హామీ ఇచ్చారు.

ఎస్వీయూ ప్రస్థానంపై ప్రతిభా పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న లైబ్రరీ డైరెక్టర్ సురేంద్రబాబు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 13: వేంకటేశ్వర యూనివర్సిటీ 70 ఏళ్ల ప్రస్థానంపై కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతిభా పోటీలు నిర్వహించారు. వక్తృత్వం, వ్యాసరచన, పెయింటింగ్ అంశాల్లో చేపట్టిన పోటీలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. వర్సిటీ సెంట్రల్ లైబ్రరీ డైరెక్టర్ ప్రొఫెసర్ సురేంద్రబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. న్యాయనిర్ణేతలుగా ఆకాశవాణి మాజీ సంచాలకులు మల్లేశ్వరరావు వ్యవహరించారు. విజేతలకు ఈ నెల 17వ తేదీన బహుమతులు అందజేయనున్నారు.

ఎడోక్సియాలో ప్రొఫెసర్ సుధాకరయ్యకు సభ్యత్వం



సుధాకరయ్యను అభినందిస్తున్న ఇన్‌చార్జి వీసీ అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 13: ఎస్వీయూ గణిత విభాగ ప్రొఫెసర్ సుధాకరయ్యకు అమెరికాకు చెందిన ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ లాంగ్వేజెస్ సొసైటీ (ఎడోక్సియా)లో సభ్యత్వం లభించింది. రాబోయే ఏడాది కాలం ఆ సంస్థ నిర్వహణలో ఆయన భాగస్వామిగా వ్యవహరించనున్నారు. వర్సిటీ ఇన్‌చార్జి వీసీ అప్పారావు అభినందించారు.

నేడు 'నిర్వాణ' నవల ఆవిష్కరణ సభ

తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 13: తిరుపతికి చెందిన వేమన విజ్ఞాన కేంద్రం, దళిత సాహిత్య వికాస వేదిక సంయుక్తంగా శనివారం ఉదయం డాక్టర్ బండి సత్యనారాయణ రచించిన నిర్వాణ నవల ఆవిష్కరణ సభ నిర్వహిస్తున్నాయి. యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు సభ జరుగుతుంది.

సంస్కృత వర్సిటీలో ముగిసిన స్వచ్ఛతా పక్షోత్సవాలు

తిరుపతి రూరల్, సెప్టెంబరు 13: జాతీయ సంస్కృత వర్సిటీలో 15రోజుల పాటు నిర్వహించిన స్వచ్ఛతా పక్షోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ విభాగ ప్రొఫెసర్ ఎం.శ్రీమురురాలి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను పాటించాలన్నారు. వేస్ట్ నుంచి వెల్త్‌ని ఏవిధంగా మేనేజ్ చేయాలన్న అంశాన్ని వివరించారు. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ వ్యక్తిగత ఆరోగ్యంతోపాటు సామాజిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సాంబశివమూర్తి, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్‌శుక్లా, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ సింగరాజు దక్షిణామూర్తిశర్మ, ఎన్ఎస్ఎస్‌సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎ.చందులాల్, కో-ఆర్డినేటర్ డాక్టర్ వైష్ణవి, అడిషనల్ కోఆర్డినేటర్ డాక్టర్ మేరీ సుజాత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'స్వచ్ఛతా హి సేవ'



మురుగునీటి కాల్వను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి) : నగరంలో స్వభావ్ స్వచ్ఛత, సంస్కార్ స్వచ్ఛత అనే నినాదంతో 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమం శనివారం నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు కమిషనర్ నారపరెడ్డి మౌర్య తెలిపారు. శుక్రవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్, హెల్త్, ప్లానింగ్ విభాగపు అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఈనెల 17వ తేదీ నుంచి అన్నిచోట్ల పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా ఖాళీ స్థలాలను శుభ్రం చేసి, మొక్కలు నాటాలని సూచించారు.

ప్రధాన కాలువల్లో చెత్త తొలగించండి

నగరంలోని ప్రధాన కాలువల్లో జరుగుతున్న చెత్త తొలగింపు పనులను రెండు, మూడు రోజుల్లో పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఇంజనీరింగ్, హెల్త్ అధికారులతో కలిసి ఆమె పనులను పరిశీలించారు. గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్(జీవీపీ)లో చెత్త లేకుండా శుభ్రం చేయించాలన్నారు.

క్యాంటీన్ నిర్వహణపై ప్రిన్సిపాల్ విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 13 : రుయాస్పత్రి ఆవరణలో ఏపీజీడీప పేరుతో నిర్వహిస్తున్న క్యాంటీన్‌పై ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ విచారణ చేపట్టారు. గడువు ముగిసినా నిర్వహిస్తున్న విషయంపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన ప్రిన్సిపాల్ క్యాంటీన్‌ను ఎవరు నిర్వహిస్తున్నారు.. గడువు ముగిసినా ఎందుకు కొనసాగిస్తున్నారనే దానిపై వివరణ ఇవ్వాలని ఏపీజీడీప నేతలను ఆదేశించారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9160195583, 9703618708, 9703618705, 9703618710, 9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME

I, Pulicherla Yughandhara Naidu (Old Name) S/0 Pulicherla Kannaiah Naidu, residing at 1-32, Bheemavaram, Chandragiri, Tirupati Urban, A.P. I declared that i have changed my name as Pulicherla Yugandhar Naidu (New Name).
AJT - 1100

CHANGE OF NAME

I,Syeda Sumiya Iffath (Old Name), D/o .Syed Amanulla , R/o: 25-21/3, Nana Bala Street, Punganur- 517 247, Chittoor Dist. A.P. Hereby declare that I have changed my name as Syeda Sumaiya Iffath (New Name), W/o.Nanjampeta Shaik Ashraf Ali
AJT - 2345

CHANGE OF SURNAME

I, KANDURU RAVI KUMAR (Old Name) R/o:1-72-9-5,Sankar Naidu Colony, THIRUCHANUR,TIRUPATI Dt, A.P. Do here by declared I have changed my Surname as KANDURI RAVI KUMAR (New Name) S/o K.V R RAMANUJA CHARYULU
AJT - M

PLOT FOR SALE

JP Infra, Tirupati కి 10 కిమీ పరిధిలో భూవరాహ పామ్ ల్యాండ్స్ శ్రీ గంధం మొక్కలతో ప్లాటు అమ్మబడును. ప్లాటులో సుమారు 1 కోటి రూ: అదనపు ఆదాయం వివరాలకు సెల్: 73821 93459, 94415 31587
AJT-

PLOTS FOR SALE

నాయుడుపేట బస్టాండ్ నుండి 4 కిమీ దూరంలో 6 లైన్స్ హైవేకి 2వ బిట్ అయిన తుడా అప్రూవల్ 43 ఎకరాల మెగా వెంచర్‌లో 1 Sq.Feet 420 రూ. మాత్రమే. సెల్: 99660 66111
AJT-4281

వధువు కావలెను

రెడ్డి కులం, వయస్సు : 35, MBA, B.Ed., ఎత్తు–5.9, తిరుపతి. ప్రముఖ వ్యాపార సంస్థ వరుడికి సరైన వధువు కావలెను. సంప్ర. : 91105 49394.
AJT - 187492

FLAT FOR SALE

SUV Non Teaching Colony, Vidyanagar, 2 BHK, 1014 Sq. Feet, West Face with Car Parking in Venkatasai Appartment. Cont. : 99495 35213
AJT - 4278

NEUROLOGIST

డా.కె.నిరంజన్ బాబు, M.D (Med), D.M (Neuro) పక్షవాతం (Stroke), I.C.U (24hrs), ఫిట్స్ (మూర్ఛ) తలనొప్పి, మైగ్రేన్ తలతిరుగుట, తిమ్మిర్లు, మెడ, నడుము, కండరాల నొప్పులు, సంప్ర. సాయి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, DBR హాస్పిటల్ వెనుక, కొర్లగుంట, తిరుపతి సెల్ : 94944 03825.
AJT - 196762

RENT / LEASE

తిరుపతి లీలామహల్ సర్కిల్, విజ్ఞేష్ టవర్స్‌లో 501, 502 (2300 sft) కమర్షియల్‌కు ఇవ్వబడును. పూర్తి వివరాలకు సంప్రదించండి. సెల్: 98667 26232
AJT-4270

ONE SITTING

Discontinued or ఫెయిలైన విద్యార్థులకు సంగలో పాస్ అయ్యే అవకాశం.10th / Inter / Degree / PG / Diploma/ B.Tech./ LLB / Certificate Courses, UGC Regd. Universities. Sri Sai Education, Kadapa, Cell : 98855 11226
Ajc-196211

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647
AJA- 198071

VEHICLE FOR SALE

» AP-39 FA 8026 MARUTHI ERTIGA VDI Model - 2012 వాహనము తేది 16-9-2024 న ఉదయం 10.30 ని.లకు అమ్మబడును. వివరములకు అరుణా ఫైనాన్స్ లిమిటెడ్. సెల్ : 93980 26303, 88851 22377
AJB-698

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

శుభస్వీకరణ



ప్రేమ, అప్యాయతానురాగాలు పంచి, మా కుటుంబ అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించిన మా తల్లిగారు శ్రీమతి గుండాల లక్ష్మమ్మ గారు 01.09.2024 వ తేది ఆదివారం స్వర్గస్తులైనారు. వీరి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నాము.

శుభస్వీకరణ

15.09.2024 వ తేది ఆదివారం ఉ॥ 10.30 గం॥లకు చిన్నగొట్టిగల్లు మండలం, తిప్పిరెడ్డిగారిపల్లి గ్రామం, కమ్మపల్లి, విశాల్ గార్డెన్స్‌లో మా స్వగృహము నందు కర్మక్రియలు జరుగునని తెలియజేయడమైనది.

శోకతప్త హృదయాలతో...

శ్రీమతి గుండాల లక్ష్మమ్మ గారు
భర్త కీ॥శే॥ గుండాల రాధాకృష్ణయ్య
యడంవారిపల్లి

కుమారుడు
వెంకటరమణ గుండాల (వాసు)
యడంవారిపల్లి. సెల్: 9986871018

రెండు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ స్వాధీనం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 13: సూళ్లూరుపేట మండ లంలోని పెరిమిటిపాడు సమీపంలో అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌ను శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు.

తెలుగు భాష ఆయన శ్వాస

● స.వెం. రమేశ్‌కు నేడు బొమ్మిడాల పురస్కారం



ఆయన పుట్టి పెరిగింది తమిళనాట. కానీ జన్మమూలాల అమ్మభాష అయిన తెలుగే శ్వాసగా తపిస్తున్నారు. భాషా రాష్ట్రాల పేరుతో తెలుగు భాష, సంస్కృతులకు కలిగిన ముప్పును వివరిస్తూ, కాపాడుకుందామంటూ ఉద్యమకారుడిగా అలుపెరగని ప్రయాణం సాగిస్తున్నారు. ఎల్లలకు ఆవల ఉన్న తెలుగుదనాన్ని లోకానికి చాటుతున్నారు. తెలుగు పరిశోధకుడిగా దేశదేశాలు పర్యటిస్తున్నారు స.వెం.రమేశ్. ఆయన చేస్తున్న విశేష కృషికి గుంటూరుకు చెందిన బొమ్మిడాల కృష్ణమూర్తి ఫౌండేషన్ అత్యున్నత పురస్కారాన్ని ప్రకటించింది. శ్రీకాళహస్తి కేంద్రంగా చేసుకుని ప్రస్తుతం తెలుగు భాషోద్యమం నడుపుతున్న స.వెం.రమేశ్‌కు గుంటూరులో నేటి సాయంత్రం జరిగే ప్రత్యేక సభలో బొమ్మిడాల పురస్కారం అందజేస్తారు.

గురువు పుష్పరాజ్ సహా ఏడుగురితో ఏర్పడిన తెలుగువాణి సంస్థ ద్వారా స.వెం.రమేశ్ తమిళనాడులోని వేలూరు ప్రాంతంలో తెలుగు తరగతులను ప్రారంభించారు. అనేక తెలుగు పల్లెల్లో తిరిగి తెలుగు రాయడం చదవడం నేర్పించారు. వేలూరు పరిసరాల్లోని 80 గ్రామాల్లో నాలుగు వేల మంది తెలుగు నేర్చుకున్నారు. వారిలో కొందరు తెలుగులో కథారచయితలుగా, కవులుగా మారారు. ఆ తరువాత కంచి, హోసూరు, తిరవళ్లూరు తదితర ప్రాంతాల్లో తెలుగు ఉద్యమాన్ని నడిపించి అక్కడి భాషాభిమానుల్లో ఉత్తేజం నింపారు. ఇక ప్రపంచ నలుమూలల్లోని తెలుగువారి మూలాల కోసం ఆయన అన్వేషణ కొనసాగింది. శ్రీలంక దేశంలో పాములు, కోతులు ఆడించే రెండు తెగల ప్రజలు తెలుగువారు ఉన్నట్లు గుర్తించి వారి దగ్గరకు వెళ్లి వారి జీవన సంస్కృతులు అధ్యయనం చేశారు. వారి తెలుగు మూలాలు వెలుగులోకి తెచ్చారు. అలాగే బంగ్లాదేశ్‌లోని వందలాది మారుమూల పల్లెల్లో సుమారు 6.5లక్షల మంది తెలుగువారు ఉన్న విషయం వెలుగులోకి తెచ్చారు. ఇక అమెరికా, మలేసియా, మారిషస్ దేశాల్లో కూడా ఆయన పర్యటించి తెలుగు భాషపై లోతైన పరిశోధన చేశారు. 200 ఏళ్ల క్రితం మలేషియాలో స్థిర పడ్డ తెలుగువారు నేటికీ గెంతు, దాటు భజనలు, కోలాటాలు, బుర్రకథలు పదిలంగా కాపాడుకోవడం గుర్తించారు. రచయితగానూ ఆయన రాసిన పుస్తకాలు అచ్చతెలుగు అక్షరాలతో అల్లిన పరిమళ దండలు. భాషాభిమానులను ఎంతగానో పెనవేసుకున్నాయి. ఇందులో ప్రధానంగా పులికాట్ తీర ప్రజల జీవన విధానాన్ని కళ్లకు కట్టిన 'ప్రళయ కావేరి కతలు' పుస్తకం, 'కతల గంప' విశేషంగా తెలుగు పాఠకులను ఆకట్టుకున్నాయి. ఎల'లు లేని తెలుగు' వ్యాసాల పుస్తకం, 'సజీవ సాంప్రదాయంగా వేమన' పరిశోధన పుస్తకం, వ్యాకరణంపై తెలుగు నుడికట్టు పుస్తకం స.వెం.రమేశ్ సాహిత్య, భాషా కృషిని వెల్లడిస్తాయి.

- శ్రీకాళహస్తి

రీడింగ్ రూములు కనుమరుగు





నిరుపయోగంగా ఉన్న వైఎస్ఆర్ పార్కులోని రీడింగ్‌రూము - సచివాలయంగా మారిన తూర్పువీధిలోని రీడింగ్‌రూము

గూడూరు, సెప్టెంబరు 13: పట్టణ ప్రజలకు విజ్ఞానాన్ని అందించేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గతంలో ఏర్పాటు చేసిన రీడింగ్ రూములు నిర్వహణలేక కనుమరుగైపోయాయి. గతంలో గూడూరులో మున్సిపాలిటీ నిర్వహణలో 7 రీడింగ్ రూములు ఉండేవి. తూర్పువీధి, మసీదువీధి, వీఎస్ఆర్ పార్కు, అశోక్ నగర్, సీవీసీ పార్కు, కూరగాయల మార్కెట్ సమీపంలో ఏనుగు నరహరిరెడ్డి పార్కు, వాలయనందాపురం నీళ్లట్యాంకు ఆవరణలో రీడింగ్ రూములను ఏర్పాటు చేశారు. వీటిల్లో దినపత్రికలు, మేగజైన్లు, కాంపిటేటివ్ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంచేవారు. ఉదయం 8నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు, సాయంత్రం 4నుంచి 6 గంటల వరకు ప్రజలు, విద్యార్థులు పుస్తక పఠనం చేసేవారు. గత వైసీపీ ప్రభుత్వం రీడింగ్ రూముల నిర్వహణను పట్టించుకోకపోవడంతో కొన్ని కనుమరుగు కాగా, మరికొన్ని నిరుపయోగంగా మారాయి. తూర్పువీధిలోని రీడింగ్ రూములో 10వ సచివాలయం ఏర్పాటు చేశారు. మసీదు వీధిలోని రీడింగ్‌రూమును మున్సిపల్ పాఠశాలలో కలిపేశారు. శిథిలావస్థకు చేరిన వాలయనందాపురం రీడింగ్‌రూము పునర్నిర్మాణాన్ని అసంపూర్తిగా ఆపేశారు. ఏనుగు నరహరరెడ్డి పార్కులోని రీడింగ్ రూము మూతపడింది. ఒక్క సీవీసీ పార్కులోని రీడింగ్ రూము తప్ప మరెక్కడ వినియోగంలో లేవు. కూటమి ప్రభుత్వం లోనైనా మున్సిపల్ రీడింగ్‌రూములను తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని పాఠకప్రియులు కోరుతున్నారు.

పొదుపు నిధుల గోల్‌మాల్‌పై విచారణ

డక్కిలి, సెప్టెంబరు 13: డక్కిలి మండలం నాగవోలు క్లస్టర్‌లో పొదుపు సంఘాల నిధుల గోల్‌మాల్ వ్యవహారానికి సంబంధించి శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో అధికారులు రెండో దఫా విచారణ చేపట్టారు. డక్కిలి వెలుగు కార్యాలయంలో అక్రమాలు చోటు చేసుకొన్నాయని, సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం ఇవ్వాలని ఏపీ ప్రజాసంఘాల కన్వీనర్ గద్దల మునెయ్య కోరారు. స్థానిక అధికారులు సమాచారం ఇవ్వకపోవడంతో ఆయన ఉన్నతాధికారులను ఆశ్రయించారు. విచారణ చేపట్టిన అధికారులు 11 మంది సిబ్బందిని సస్పెండ్ చేశారు. అయితే నాగవోలు క్లస్టర్‌లో పనిచేస్తున్న వెలుగు సీసీ రమేష్ అక్రమాలకు పాల్పడ్డారని, అతనిపై చర్యలు తీసుకోలేదని జిల్లా ఉన్నతాధికారులకు పలువురు ఫిర్యాదు చేశారు. శుక్రవారం వెలుగు ఏరియా కమ్యూనిటి కో ఆర్డినేటర్ తిరుపాల్‌రెడ్డి బృందం మండలంలోని దందవోలు, మోపూరు, పలుగోడు, నాగవోలు గ్రామాల్లో పొదుపు సంఘాల లావాదేవీల రికార్డులు పరిశీలించారు. విచారణ అనంతరం నివేదికను డీఆర్‌డీఏ పీడీకి అందచేస్తామని అధికారులు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గూడూరు అర్బన్, సెప్టెంబరు 13: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గూడూరు పట్టణంలో శనివారం ఉదయం 9:30నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వెంకటగిరి: పట్టణంలోని పాలకేంద్రం వద్ద ఉన్న 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా వెంకటగిరి మున్సిపాలిటీ, రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ మునిరవిచంద్ర తెలిపారు.

పెళ్లకూరు: మండలంలో శిరసనంబేడు, కప్పగుంటకండ్రిగ, చెంబేడు క్రాస్‌రోడ్డు సబ్‌స్టేషన్ల పరిధిలోని మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకువిద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ అంజాద్‌బాషా తెలిపారు.

సూళ్లూరుపేట: తడ, దొరవారిసత్రం, సూళ్లూరుపేట పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో శనివారం ఉదయం 6:30నుంచి 9:30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఏ ఖాదర్ బాషా తెలిపారు.

తడ: సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు తడ మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ మురళి తెలిపారు.

స్కూల్ కాంప్లెక్స్‌తో విద్యార్థులకు సౌకర్యం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 13: స్కూల్ కాంప్లెక్స్ విధానం విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్ అన్నారు. నాయుడుపేట విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం 11 మండలాల ఎంఈవోలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఒకే పంచాయతీ, ఒకే సచివాలయం పరిధిలో ఉన్న పాఠశాలలను స్కూల్ కాంప్లెక్స్ విధానంలో మ్యాపింగ్ చేయడం జరిగిందన్నారు. సంబంధిత రికార్డు వర్కులను త్వరితగతిన పూర్తి చేయాలని డీఈవో సూచించారు. అదే విధంగా ఈ నెల 19, 20వ తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా నాయుడుపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అండర్-14, అండర్-17 విభాగాల్లో మండలస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల ఏర్పాట్లపై ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులతో డీఈవో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు మార్చి రూ.40 వేలు స్వాహా

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 13: ఏటీఎం కార్డు మార్చి రూ.40వేలు స్వాహా చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. పట్టణానికి శారద అనే మహిళ ఈనెల 9వ తేదీన భరత్ నగర్‌లోని ఏటీఎంలోకి నగదు డ్రా చేసేందుకు వెళ్లింది. ఆమెకు ఏటీఎం కార్డు వినియోగించడం తెలియకపోవడంతో పక్కనే ఉన్న ఓ యువకుడు నగదు తీసిస్తానని కార్డు తీసుకున్నాడు. శారదను ఏమార్చి తన వద్ద నకిలీ కార్డుతో నగదు డ్రా చేస్తున్నట్లు నటించాడు. డబ్బులు రావడంలేదంటూ నకిలీ కార్డు ఆమెకు ఇచ్చేసి అసలు కార్డు తీసుకెళ్లిపోయాడు. కొంత సమయం తరువాత తన ఫోన్‌కు రూ.40వేలు డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో ఆ మహిళ మోసపోయినట్లు గుర్తించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

యంత్రాలతో ఉపాధి పనులు

బిల్లులు చెల్లించవద్దని ఏపీడీ ఆదేశం



ఉపాధి పనుల పరిశీలనకు వచ్చిన ఏపీడీతో యాక్టివ్ మేట్ వాగ్వాదం

బాలాయపల్లి, సెప్టెంబరు 13: మండలంలోని సుబ్రమణ్యం గ్రామంలో ఉపాధి పనులను యంత్రాలతో చేపట్టారు. ఈ విషయమై గ్రామస్తులు డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్‌కు శుక్రవారం ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. సిద్దాగుంటలో జరుగుతున్న ఉపాధి పనుల పరిశీలనకు వచ్చిన ఏపీడీ వరప్రసాద్‌రావును సుబ్రమణ్యంలో యంత్రాలతో చేపడుతున్న పనులను పరిశీలించమని పీడీ ఆదేశించారు. దీంతో ఏపీడీ సుబ్రమణ్యం గ్రామానికి వెళ్లి యంత్రాలతో చేపట్టిన పంటకాలువ పనులను పరిశీలించారు. క్షేత్ర సహాయకుడిని పిలిచి వర్క్ ఐడీ నంబరు, ఎస్టిమేషన్ వివరాలు అడుగుతుండగా యాక్టివ్ మేట్‌గా వ్యవహరిస్తున్న వ్యక్తి ఏపీడీతో వాదనకు దిగారు. ఆగ్రహించిన వరప్రసాద్‌రావు యంత్రాలతో చేపడుతున్న పనులకు బిల్లులు చెల్లించవద్దని క్షేత్ర సహాయకుడిని ఆదేశించి వెళ్లి పోయారు.

వాణిజ్య బ్యాంకులకు . దీటుగా సహకార సంఘాల సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న రవిరాజశేఖర్

గూడూరు, సెప్టెంబరు 13: వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార సంఘాలు అభివృద్ధి చెందుతున్నాయని డివిజనల్ సహకారశాఖ సహాయ అధికారి రవిరాజశేఖర్ అన్నారు. శుక్రవారం స్థానిక 24 సొసైటీ కార్యాలయ ఆవరణలో మహాజనసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాలు అభివృద్ధి చెందేలా కేంద్రప్రభుత్వం ఆత్మనిర్బర్ పథకంలో భాగంగా కంప్యూటరీకరణ చేస్తోందన్నారు. సంఘ సభ్యులందరూ కేవైసీ చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ విధానాన్ని త్వరితగతిన పూర్తిచేసి సభ్యులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో శ్యామ్ కుమార్, సత్యవతి, నారాయణ, రామయ్య, పులమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు రాజు, జనార్దనరెడ్డి, పుట్టి వెంకటేశ్వర్లు, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరం

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 13: స్థానిక విశ్వనాథపురంలో శ్రీనివాస సేవా ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం సుమన్ దంత ఆస్పత్రి సహకారంతో దంత వైద్య శిబిరం నిర్వహించారు. 150మందికి దంత పరీక్షలు చేసి ఉచితంగా పేస్టు, బ్రష్‌లు అందజేశారు.

బాలిక అదృశ్యం



అఫ్రీన్

సూళ్లూరుపేట, సెప్టెంబరు 13: సూళ్లూరుపేట పట్టణానికి చెందిన షేక్ అఫ్రిన్(12) శుక్రవారం అదృశ్యమైంది. పోలీసుల కథనం మేరకు.... పట్టణంలోని గాండ్లవీధికి చెందిన షేక్ అజముద్దీన్, వదియా దంపతుల కుమార్తె అఫ్రీన్ స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. శుక్రవారం ఉదయం 5:30 గంటల సమయంలో ట్యూషన్‌కు బయలుదేరింది. మార్కెట్ వీధిలో నడిచి వెళ్తున్న బాలికను చిన్నాన్న మోటారు సైకిల్‌పై తీసుకెళ్లి పాఠశాల గేటు వద్ద వదిలిపెట్టి వచ్చాడు. 8 గంటలైన బాలిక ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పాఠశాలకు వద్దకు వెళ్లి విచారించగా ట్యూషన్‌కు రాలేదని చెప్పారు. పరిసర ప్రాంతాల్లో వెతికిన ఆచూకీ లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు పాఠశాల వద్దనున్న సీసీ పుటేజ్‌ను పరిశీలించగా బాలిక ట్యూషన్‌కు వెళ్లకుండా పాఠశాల గేటు వద్ద నుంచి వెనుతిరిగినట్లు కనిపించింది. అఫ్రిన్‌ను రైల్వేస్టేషన్ వద్ద చూసినట్లు స్థానికులు కొందరు చెబుతున్నారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఇతర ప్రాంతాల పోలీస్ స్టేషన్లకు బాలిక ఫొటోతో సమాచారం అందించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బ్రహ్మా నాయుడు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తడ, సెప్టెంబరు 13: మలుపు తిరుగుతున్న లారీని బైక్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఢిల్లీకి చెందిన తమిల్ మాలిక్(25) శ్రీసిటీ సెజ్‌లోని పరిశ్రమలో పని చేస్తూ తడలో నివాసం ఉంటున్నాడు. బుధవారం అర్ధరాత్రి సమయంలో బైక్‌పై ఆరంబాకం వరకు వెళ్లాడు. అక్కడ నుంచి తడకు వస్తుండగా శ్రీసిటీ జీరో పాయింట్ వద్ద మలుపు తిరుగుతున్న లారీని బైక్‌తో వేగంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తమిల్ మాలిక్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 13: ఓ మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. పట్టణ పరిధిలోని తుమ్మూరుకు చెందిన చంద్రమ్మ, ఆమె భర్త పట్టణంలో లాండ్రి దుకాణం నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రం బజారుకు వెళ్లిన చంద్రమ్మ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు పరిసర ప్రాంతాల్లో గాలించారు. ఆచూకీ లేకపోవడంతో చంద్రమ్మ కుమారుడు రాజశేఖర్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 13: నాయుడుపేట స్వర్ణముఖినది తీరం సమీపంలో మోటారు సైకిల్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. శుక్రవారం రాత్రి పట్టణానికి చెందిన అభిలాష్ రోడ్డు పక్కన నిలబడి ఉండగా, అటువైపు వచ్చిన మోటారు సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో అభిలాష్‌తో పాటు మోటారు సైకిలిస్టు వేణుగోపాల్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పెళ్లకూరు ఎస్ఐగా నాగరాజు



పెళ్లకూరు, సెప్టెంబర్ 13: పెళ్లకూరు ఎస్ఐగా కే.నాగరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తుండిన ఎస్ఐ శ్రీకాంత్‌ను తిరుపతి వీఆర్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న నాగరాజును నియమించారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపలపై గట్టి నిఘా ఉంచుతామన్నారు. ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా కఠిన చర్యల తీసుకుంటామని స్పష్టం చేశారు.

అన్నదానం



గూడూరు, సెప్టెంబరు 13: స్థానిక ముత్యాలపేటలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి శుక్రవారం ప్రత్యేక పూజలు జరిపారు. గణపతి హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

టైలరింగ్ కోర్సు ప్రారంభం

నాయుడుపేట, సెప్టెంబరు 13: పట్టణంలోని గాంధీ మందిరం సెంటర్ వద్ద ఉచితంగా టైలరింగ్ కోర్సును రాస్ సభ్యుడు సుధాకర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పొదుపు సంఘాల సంచాలకుడు నాగరాజు, రాస్ సభ్యులు వెంకటేష్, వినోద్‌కుమార్, సునీత, రమణమ్మ, మహిళలు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి నందమూరి ఫ్యాన్స్ డాట్ కాం చేయూత



కౌశిక్ తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న నందమూరి ఫ్యాన్స్ డాట్‌కామ్ ప్రతినిధులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 13:క్యాన్సర్‌తో బాధపడుతూ ఆర్థిక సమస్యల కారణంగా చికిత్స చేయించుకోలేక... రోజు రోజుకూ మరణానికి దగ్గరౌతున్న ఓ యువకుడికి నందమూరి ఫ్యాన్స్ డాట్ కాం ఆర్థిక సాయం అందించింది. జూనియర్ ఎన్టీఆర్ వీరాభిమాని, తిరుపతికి చెందిన పందొమ్మిది దేళ్ల యువకుడు కౌశిక్ కాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని 'దేవర సినిమాచూసి చచ్చిపోతా... అమ్మా అప్పటిదాకా బతికించండి' శీర్షికన ఆంధ్రజ్యోతి శుక్రవారం ఓ కథనాన్ని ప్రచురించింది.స్పందించిన నందమూరి ఫ్యాన్స్ డాట్ కాం వెబ్‌సైట్ ప్రతినిధులు బాధితుడి ఇంటికి చేరుకుని 40వేల రూపాయల నగదును కౌశిక్ తల్లిదండ్రులకు అందజేశారు. నందమూరి హీరోల అభిమానులు కొంతమంది నందమూరి డాట్ కాం పేరున ఓ వెబ్‌సైట్‌ను కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నారు. ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారిని గుర్తించి వీరు ఆపన్న హస్తం అందిస్తున్నారు. ఈ క్రమంలో అనేకమంది విద్యార్థులకు ఫీజులు చెల్లించడం, పుస్తకాలు కొనివ్వడం లాంటి సేవలు అందిస్తున్నారు.

నేడు జూనియర్ ఎన్టీఆర్ పరామర్శ

కౌశిక్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న హీరో జూనియర్ ఎన్టీఆర్ శనివారం అతడిని పరామర్శించనున్నారు.తిరుపతికి చెందిన తన అభిమాని కృష్ణయాదవ్‌కు ఫోన్ చేసి కౌశిక్ దగ్గరకు వెళ్లి తనతో ఫోన్లో మాట్లాడించమని చెప్పినట్లు సమాచారం.



జాతర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే కురుగొండ్ల

25, 26 తేదీల్లో పోలేరమ్మ జాతర

వెంకటగిరి, సెప్టెంబరు 13: వెంకటగిరి పట్టణంలో ఈనెల 25, 26 తేదీల్లో రెండు రోజుల పాటు గ్రామశక్తి పోలేరమ్మ జాతర ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో వైభవంగా నిరహించనున్నట్లు దేవదాయశాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం నెల్లూరులోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే కురుగొండ్లతో కలిసి జాతర పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

తిన్నెలపూడి సహకార సంఘంలో మహాజన ఉత్సవాలు



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఏసీడీపీవో జ్యోతికిరణ్

కోట, సెప్టెంబరు 13: కోటలోని తిన్నెలపూడి వ్యవసాయ సహకార సంఘంలో శుక్రవారం మహాజన ఉత్సవాలు జరిగాయి. పర్సన్ ఇన్‌చార్జి మహేష్‌సింగ్, సీఈవో శ్రీనివాసులు మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా రైతులకు కల్పిస్తున్న రాయితీలు, రుణాలపై అవగాహన కల్పించారు. సంఘ సభ్యుల కేవైసీని ప్రారంభించారు. సహకార సంఘంలో లావాదేవీలను కంప్యూటరీకరణ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుర్రం అశోక్‌కుమార్, సురేంద్రరెడ్డి, శ్యామసుందర్, సహకార బ్యాంక్ మేనేజర్ సాయికేశవరావు, అసిస్టెంట్ మేనేజర్ వెంకటేశ్వర్లు, నరసరాజు, నెల్లూరుపల్లికొత్తపాళెం, ఊనుగుంటపాళెం, సిద్ధవరం, చిట్టేడు సహకార సంఘాల సీఈవోలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

చిల్లకూరు, సెప్టెంబరు 13: చిల్లకూరు మండలం తిక్క వరం ఎస్టీకాలనీలోని అంగన్ వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు శుక్రవారం ఐసీ డీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికా హారంపై అవగాహన కల్పిం చారు. ఈసందర్భంగా ఏసీడీపీవో జ్యోతికిరణ్ మాట్లా డుతూ అంగన్‌వాడీ కేంద్రా ల్లో అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు తప్ప నిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రేణుకమ్మ, రమణమ్మ, రోజా, చంద్రమ్మ పాల్గొన్నారు.

కేశవరంలో పౌష్టికాహార మాసోత్సవాలు

కోట, సెప్టెంబరు 13: మండల పరిధిలోని కేశవరం, చిట్టేడు గ్రామాల్లో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలు జరిగాయి. సీడీపీవో మునికుమారి సూపర్‌వైజర్లు కవిత, కృష్ణమ్మ పాల్గొని పౌష్టికాహారాన్ని ఇచ్చే ఆకుకూరలు, కాయగూరల గురించి అవగాహన కల్పించారు. అనంతరం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు.

క్రీడాకారులకు శుభాకాంక్షలు

గూడూరు అర్బన్, సెప్టెంబరు 13: టెన్నీకాయిట్ క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించాలని ఆ అసోసియేషన్ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఈనెల 14నుంచి 16వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు వెళుతున్న జిల్లా జట్టు క్రీడాకారులకు ఆయన దుస్తులను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



విద్యానగర్ సెంటర్‌లో విరాళాలు సేకరిస్తున్న జనసేన నాయకులు

కోట, సెప్టెంబరు 13: మండల కేంద్రమైన కోట, విద్యానగర్‌లో జనసేన నేతలు విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు శుక్రవారం జోలిపట్టి విరాళాలు సేకరించారు. పట్టణంలోని బజారుసెంటర్, క్రాస్ రోడ్డు, ఆర్టీసీ సెంటర్, విద్యానగర్‌లోని గాంధీబొమ్మ సెంటర్, కొత్తపాళెం రోడ్డులో జనసేన నేతలు ఇంటింటికీ వెళ్లి విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకుడు అల్లంబాబు, టీడీపీ అధికార ప్రతినిధి డాక్టర్ తిరుమలశెట్టి కోటేశ్వరరావు, గూడూరు కృష్ణ, చంద్రశేఖర్, హుస్సేన్, మున్నపతి, రేవంత్, వినోద్, హర్ష, మస్తాన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల విరాళం

వాకాడు, సెప్టెంబరు 13: మండలంలోని వాకాడు సెయింట్‌పాల్ పాఠశాల విద్యార్థులు వరద బాధితుల సహాయార్థం రూ.20వేలు విరాళం అందజేశారు. ఈ శుక్రవారం పాఠశాల కరస్పాండెంట్ సుమంత్ ఏపీపీయూఎస్ఎంఏ ప్రెసిడెంట్ జీవి.పవన్‌కుమార్‌కు చెక్కు అందజేశారు.

సీతారామ్ ఏచూరి సేవలు చిరస్మరణీయం



ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 13: భారత కమ్యూనిస్టు ఉద్యమ ముద్దుబిడ్డ సీతారామ్ ఏచూరి సేవలు చిరస్మరణీయమని సీఐటీయూ నేత ముకుంద అన్నారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం సీతారామ్ ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి విజయమ్మ, సీఐటీయూ సభ్యుడు వీరాస్వామి, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు సునీల్, రజక సంఘం నాయకుడు పుట్టయ్య, యూటీఎఫ్ నాయకుడు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దాతల చొరవ అభినందనీయం



ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కు చెక్కు అందజేస్తున్న కళాశాల సిబ్బంది

గూడూరు, సెప్టెంబరు 13: విజయవాడలోని వరద బాధితులను ఆదుకునేందుకు నియోజకవర్గంలోని పలువురు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో వరద బాధితుల సహాయార్థం కళాశాల ఆధ్వర్యంలో సీఎం సహాయనిధికి రూ.1,03,015 చెక్కు ఎమ్మెల్యేకు అందజేశారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు సేకరించిన దుస్తులను విజయవాడకు పంపే వాహనాన్ని ఎమ్మెల్యే జెండా ఊపి సాగనంపారు. కార్యక్రమంలో విద్యాసాగర్‌రావు, హనుమంతరావు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, ఇశ్రాయిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని పలువురు దాతలు సీఎం సహాయనిధికి విరాళాల చెక్కులను ఎమ్మెల్యేకు అందజేశారు.

గణనాథుల గ్రామోత్సవం



కోట బజారుసెంటర్‌లో ఊరేగుతున్న గణనాథుడు

కోట, సెప్టెంబరు 13: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం గణనాథుల గ్రామోత్సవం జరిగింది. కోట పట్టణంలోని ఎన్‌సీఆర్‌నగర్, శ్రీలక్ష్మమ్మకాలనీలో గణేష్ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాలతో యువత కేరింతలు కొడుతూ గణేష్ విగ్రహాలను ఊరేగించి శ్రీనివాససత్రం వద్ద సముద్రంలో నిమజ్జనం చేశారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

వరదయ్యపాళెం, సెప్టెంబరు 13: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం చెన్నై శంకర నేత్రాలయ ఆస్పత్రి, మిషన్ ఫర్ విజన్ ఆధ్వర్యంలో కంటి వైద్య ఉచిత శిబిరం జరగనుంది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరిగే శిబిరానికి వచ్చే వారు ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాలని నిర్వాహకులు తెలిపారు. శస్త్రచికిత్సకు ఎంపికైన వారికి ఉచిత రవాణా, భోజన వసతి కల్పిస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 13: శ్రీకాళహస్తి సబ్‌స్టేషన్ పరిధిలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతులు, లైన్ల నెలవారీ మరమ్మతుల కారణంగా ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం, బీఎన్‌కండ్రిగ, తొట్టంబేడు, ఏర్పేడుల్లో విద్యుత్ సరఫరా ఉండదని తిరుపతి రూరల్ ఈఈ వాసురెడ్డి తెలిపారు.
రేణిగుంట: మండల పరిధిలోని తూకివాకం, కరకంబాడీ, గాజులమండ్యం, కుర్రకాలువ సబ్‌స్టేషన్ల పరిధిలోని 11కేవీ, ఎల్‌టీ లైన్లు, విద్యుత్ తీగలకు ఆటంకం కలిగించే చెట్ల కొమ్మలను తొలగించనుండడంతో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటఅల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో డీఈఈ ప్రభాకర్ తెలిపారు.
వరదయ్యపాళెం: వరదయ్యపాళెం, సంతవేలూరు పరిధిలో విద్యుత్ స్తంభాల వద్ద చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

వరద బాధితులకు తపస్య పాఠశాల చేయూత



రేణిగుంట, సెప్టెంబరు 13: ఇటీవల రాష్ట్రంలో వరదలు సంభవించిన విజయవాడ, ఏలూరు బాధితులకు డాక్టర్ బషీర్ తపస్య పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయనిధికి శుక్రవారం రూ.40వేలను అందజేశారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి ఈ చెక్కును అందజేశారు.

బ్యాంకుల్లోనే నేరుగా రుణాలు చెల్లించాలి

సత్యవేడు, సెప్టెంబరు 13: గ్రామ సమాఖ్య ఆర్థిక లావాదేవీల రుణాలకు సంబంధించిన వాయిదా సొమ్మును నేరుగా బ్యాంకుల్లోనే జమ చేయాలని వెలుగు ఏపీఎం స్వర్ణలత తెలిపారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో ఏపీఎం ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై వీవో లీడర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... డ్వాక్రా సంఘాలకు మంజూరవుతున్న రుణాలకు సంబంధించి చెల్లింపు పారదర్శకంగా ఉండాలని కోరారు. నగదు చెల్లించేటప్పుడు తప్పనిసరిగా రశీదు తీసు కోవాలని సూచించారు. నగదు రహిత లావాదేవీలను అలవర్చుకోవాలని కోరారు. కో ఆర్డినేటర్ పళణి, అకౌంటెంట్ కాంచన తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలి

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 13: అంగనవాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భవతులు క్రమం తప్పకుండా తీసుకుంటే రక్తహీనత రాకుండా ఉంటుందని సత్యవేడు సీడీపీవో దేవకుమారి తెలిపారు. బీఎన్‌కండ్రిగ అంగనవాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన సమావేశం జరిగింది.సూపర్‌వైజర్ శిల్ప, సిబ్బంది పాల్గొన్నారు.
పిచ్చాటూరు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ సూపర్ వైజర్ మారెమ్మ తెలిపారు. శుక్రవారం కొత్త గొల్లకండ్రిగ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం మాసోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించారు. వైద్య సిబ్బంది నళినాక్షి, హిమశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

అభివృద్ధే అజెండాగా మంత్రులతో ఎమ్మెల్యే భేటీ



మున్సిపల్ శాఖ మంత్రి నారాయణతో ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, సెప్టెంబరు 13: నగరి నియోజకవర్గ అభివృద్ధే అజెండాగా ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ శుక్రవారం అమరావతిలో పలువురు మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసి ఆర్థిక సాయం అందించాలని కోరారు. నగరి, పుత్తూరు మున్సిపాలిటీలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని ఆ శాఖ మంత్రి నారాయణకు వివరించారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతానికి తుడా నిధులు అందించాలని కోరారు. నగరి, పుత్తూరు ఏరియా ఆస్పత్రుల్లో సమస్యలు తిష్ఠ వేశాయని ఆరోగ్య, వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆస్పత్రుల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆస్పత్రుల అభివృద్ధికి ఆర్థిక సహకారం అందించేందుకు మంత్రి కూడా సానుకూలంగా స్పందించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని కూడా ఎమ్మెల్యే భానుప్రకాష్ మర్యాద పూర్వకంగా కలిశారు.

హిందీతో ఉపాధి అవకాశాలు మెండు

పుత్తూరు టౌన్, సెప్టెంబరు 13: హిందీ భాష నేర్చుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని గొల్లపల్లి జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం భారతి తెలిపారు. జాతీయ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులు శ్రీరాములు, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భాషా దినోత్సవాలను నిర్వహించారు. వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులను అందించారు.

వరద బాధితుల కోసం విరాళం



పుత్తూరు టౌన్, సెప్టెంబరు 13: విజయవాడ వరద బాధితులను ఆదుకోవడం కోసం పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ప్రిన్సిపాల్ కోటేశ్వరయ్య ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో విరాళాలు సేకరించారు. కాగా విద్యార్థులు సేకరించిన రూ.27వేలను డీడీ రూపంలో కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందించారు కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసులు, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు డాక్టర్ కే. శ్రీనివాసులు, రఘురామన్ పాల్గొన్నారు.

ఓటీపీ చెప్పి సిలిండర్ తీసుకోండి

పుత్తూరు, సెప్టెంబరు 13: హెచ్‌పి గ్యాస్ వినియోగదారులు ఓటీపీని తెలిపి సిలిండర్లను తీసుకోవాలని హెచ్‌పీసీఎల్ సేల్స్ ఆఫీసర్ సురేష్ తెలిపారు. పుత్తూరులోని గ్యాస్ కార్యాలయం వద్ద శుక్రవారం ఓటీపీ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. వినియోగదారులు ఆన్‌లైన్‌లో తమ ఫోన్ ద్వారా సిలిండర్ బుక్ చేసుకుని విధిగా కంపెనీ పంపించే ఓటీపీ ద్వారా సిలిండర్లు తీసుకోవాలని కోరారు. కంపెనీ నిర్ణయించిన ధరనే డెలివరీ బాయ్‌కు చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ యజమాని రవికుమార్ పాల్గొన్నారు.

తరుణ గణపతి ఆలయంలో అన్నదానం

పుత్తూరు టౌన్, సెప్టెంబరు 13: వినాయక చవితి ఉత్సవాలు పురస్కరించుకుని పుత్తూరులో స్థానిక బెస్త వీధిలో వెలసిన తరుణ గణపతి ఆలయం వద్ద యువత ఆధ్వర్యంలో వారం రో.జులుగా స్వామి వారికి నిత్య కైంకర్యాలతో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడవ రోజైన శుక్రవారం వెయ్యిమందికి పైగటా భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, యువత, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడి మృతి



బాలకృష్ణ (ఫైల్‌ఫొటో)

వడమాలపేట, సెప్టెంబరు 13: మండల టీడీపీ నాయకుడు, విశ్రాంత ఫారెస్టు అధికారి బాలకృష్ణ శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వడమాలపేట నుంచి శుక్రవారం రాత్రి తన స్వగ్రామం పాదిరేడుకు బైక్‌పై బైపాస్ రోడ్డులో వెళ్తుండగా కారు అదుపుతప్పి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు బాలకృష్ణను తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ ధర్మారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు.

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 13: మండలంలోని వేడాంలో కొలువై ఉన్న దక్షిణ కాళికాదేవికి శుక్రవారం ఉదయం రాహుకాలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శ్రీకాళహస్తి పట్టణంతో పాటు పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాద వినియోగంతోపాటూ మధ్యాహ్నం అన్నదానం జరిగింది.

ముక్కంటి ఆలయంలో ఆగమోక్తంగా పవిత్రోత్సవాలు







శ్రీ-కాళ-హస్తి, భరద్వాజ మహర్షి ఉత్సవర్ల ఊరేగింపు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 13: దక్షిణ కైలాసంగా పేరుగాంచిన ముక్కంటి ఆలయంలో శుక్రవారం పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. నిత్య పూజల్లో జరిగే దోషాలను నివారించి మూల విరాట్లకు పునరుత్తేజానికి ఈ పూజలను నిర్వహిస్తున్నారు. ఐదురోజుల పాటు జరగనున్న ఉత్సవాల్లో తొలిరోజు దక్షిణామూర్తి వద్ద శ్రీ-కాళ-హస్తి, భరద్వాజ మహర్షి ఉత్సవర్లకు ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి జరిగాయి. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, సతీమణి రిషితారెడ్డి, ఈవో ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి, ప్రధాన అర్చకులు స్వామినాథన్ గురుకుల్, టీడీపీ నాయకుడు చెంచయ్యనాయుడు పాల్గొన్నారు.

కాణిపాక వరసిద్ధుడికి పట్టువస్త్రాల సమర్పణ



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 13: కాణిపాకంలో జరుగుతున్న వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయం తరఫున ఎమెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈవో ఎస్‌వీ ఎస్‌ఎన్ మూర్తి పట్టువస్త్రాలను సమర్పించారు. వారికి పూతలపట్టు ఎమ్మెల్యే మురళి, ఆలయ అధికారులు స్వాగతం పలికారు. వేదమంత్రోచ్చరణల నడుమ వేదపండితులు వాటిని స్వీకరించారు. అనంతరం శ్రీకాళహస్తి, కాణిపాక ఆలయాల అభివృద్ధి కోసం ఇద్దరు ఎమ్మెల్యే చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ జమా ఖర్చులపై ఆడిట్

రేణిగుంట, సెప్టెంబరు 13: మేజర్ పంచాయతీలో చేపట్టిన అభివృద్ధి పనుల జమా ఖర్చులపై ఆడిట్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో ఆడిట్ అధికారి అజయ్‌కుమార్ నేతృత్వంలో సంవత్సరం రోజుల్లో పాలకమండలి చేపట్టిన అభివృద్ధి పనుల ఖర్చు, ఆదాయంపై రికార్డులను పరిశీలిస్తున్నారు. వారం రోజులపాటు ఈ ఆడిట్ జరుగుతుందని సమాచారం.

ముక్కంటికి వెండి గిన్నెల వితరణ

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 13: శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల సందర్భంగా శుక్రవారం పట్టణానికి చెందిన మదన్ మోహన్ నాయుడు కుటుంబీకులు రూ.1.15లక్షల విలువైన వెండి గిన్నెలను అందజేశారు. ఆలయ అధికారులు, వేదపండితులు వాటిని స్వీకరించి స్వామిఅమ్మవార్ల దర్శనర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు.

ఉత్తమ గురువులకు సన్మానం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 13: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా శ్రీకాళహస్తి నుంచి జాతీయ, రాష్ట్ర, జిల్లాస్థాయి ఉత్తమ అవార్డులు పొందిన పలువురు ఉపాధ్యాయులను శుక్రవారం పిళ్లారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. సరస్వతిబాయి పురపాలక సంఘ ఉన్నత పాఠశాల ఆవరణలోని పిళ్లారి కళావేదికపై జరిగిన కార్యక్రమంలో సంస్థ నిర్వాహకురాలు అమరావతి మాట్లాడుతూ... ఉపాధ్యాయులు సమాజ దిశ, దశకు అసలైన దార్శనికులన్నారు. జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కూనాటి సురేష్‌తో పాటు పలువురిని ఎంఈవో భువనేశ్వరి తదితరులు సన్మానించారు.

టీవీలకు దూరంగా ఉండండి

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 13: విద్యార్థులు టీవీలకు అలవాటుపడితే చదువులు అటకెక్కుతాయని సీఐ తిమ్మయ్య అన్నారు. మండలంలోని కనమనంబేడు ఏకలవ్య గురుకుల పాఠశాల విద్యార్థులకు శుక్రవారం పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో ఉన్నత స్థానం వస్తుందన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలు, సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. శారీరక శ్రమ కల్గించే ఆటలాడాలన్నారు. ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు, హెడ్ కానిస్టేబుల్ నాగారాజు, ప్రిన్సిపాల్ ధర్మేంద్రసింగ్, టీడీపీ నాయకుడు మధునాయుడు తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 13: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 11మందికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్లు శ్రీకాళహస్తి 1టౌన్ సీఐ గోపి తెలిపారు. సిబ్బందితో కలిసి శుక్రవారం పట్టణవ్యాప్తంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా 11మంది మద్యం తాగి ద్విచక్ర వాహనాలను నడుపుతూపట్టుబడ్డారు. వారిని శ్రీకాళహస్తి న్యాయస్థానంలో హాజరు పరిచారు. ఈ సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వారికి రోడ్డుప్రమాదాలపై కౌన్సెలింగ్ ఇచ్చారు.

గుంతల పూడ్చివేత



వరదయ్యపాళెం, సెప్టెంబరు 13: మండలంలోని పాండూరు వద్ద రోడ్డుపై గుంతలను సత్యవేడు సీఐ మురళి ఆదేశాలతో పోలీసులు పూడ్పించారు. స్థానికులు, వాహన దారులు ఈ గుంతలతో ఇబ్బందులు పడుతుండేవారు. ఈ విషయం సీఐ దృష్టికి వెళ్లడంతో స్పందించిన ఆయన గుంతలను పూడ్పించాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. దీంతో శుక్రవారం పాండూరు రోడ్డులో ఎక్స్‌కవేటర్ సాయంతో పూడ్పించారు. ప్రజలు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

చవితి ఉత్సవాల్లో ముగ్గుల పోటీ

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 13: చవితి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రాజెక్టు వీధిలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రాజెక్టు వీధిలో శ్రీలక్ష్మీ గణపతి యువజన సంఘం ఆధ్వర్యంలో వినాయక ప్రతిమను ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 7వ రోజు శుక్రవారం స్థానిక మహిళలకు ముగ్గుల పోటీలు పెట్టారు. కలంకారీ కళాకారుడు విశ్వనాథరెడ్డి, టీడీపీ నాయకుడు ఆర్ముగం విజేతలకు బహుమతులు అందించారు.

ఘనంగా శుక్రవారం ఉత్సవం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 13: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షణ చేసి తిరిగి కొలువు తీర్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల సీజ్



ఏర్పేడు, సెప్టెంబరు 13: మండలంలో శుక్రవారం పోలీసులు ఐదు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఏర్పేడు సీఐ జయచంద్ర ఆదేశాల మేరకు పోలీసులు ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఉంచారు. ఇందులో భాగంగా మేర్లపాక వద్ద మూడు, డిక్సన్ సర్కిల్ వద్ద ఒకటి, ఫాక్స్‌లింక్ సర్కిల్ వద్ద ఒక ట్రాక్టర్ పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేశారు.

గురుభక్తితోనే చదువుకున్నాం

ఏర్పేడు, సెప్టెంబరు 13: తాము చదువుకునే రోజుల్లో గురుభక్తితో చదువుకున్నామని అదే మార్గంలో పయనించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, తిరుపతి ఆర్‌ఐవో ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి మెరిటాస్ డైరెక్టర్ శశికళ, విజయశేఖర్‌రెడ్డి, పాపానాయుడు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సునీత, ఆత్మీయ అతిథి తంబా సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులో దిగి మహిళ మృతి

వరదయ్యపాళెం, సెప్టెంబరు 13: మండలంలోని రాచర్లలో మహిళ పశువుల కోసం చెరువులో దిగి మృత్యువాత పడింది. రాచర్లకు చెందిన లక్ష్మమ్మ(53) పశువులను మేపుకుంటూ జీవనం సాగిస్తోంది. శుక్రవారం పశువులను మేపుతుండగా సాయంత్రం కొన్ని పశువులు చెరువులోకి దిగాయి. చీకటి పడుతుండటంతో వాటిని తరలించే క్రమంలో చెరువులోకి దిగింది. లోతు గుర్తించక మునిగిపోయింది. ఆమెతో పాటు ఉన్న మరో మహిళ స్థానికుల సమాచారం ఇవ్వడంతో వారు వచ్చేలోపు లక్ష్మమ్మ మృతి చెందింది. పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

మాజీ జడ్జితో సీసీఆర్ రాష్ట్ర ప్రతినిధి భేటీ

వరదయ్యపాళెం, సెప్టెంబరు 13: వరదయ్యపాళెం మండలంలోని ప్రభుత్వ భూముల ఆక్రమణలు, భూరికార్డు కనపడకపోవడంతో ఈ విషాయిన్న సీసీఎల్ దృష్టికి సీసీఆర్ రాష్ట్ర ప్రతినిధి శిరీష్ బాబు తీసుకెళ్లారు. అలయినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం రిటైర్డ్ జడ్జి, సీనియర్ న్యాయనిపుణులు శ్రావణ్‌కుమార్‌ను కలిసి చర్చించారు.

వేడుకగా పద్మావతమ్మ ఊంజల్ సేవ

నారాయణవనం, సెప్టెంబర్ 13: నారాయణవనంలో కొలువై ఉన్న కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల్ సేవను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు శుక్రవారం సందర్భంగా నిత్య కైంకర్యాలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ఉయ్యాలపై అధిష్ఠింపజేసి ఊంజల్ సేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు, ఆలయాధికారి నాగరాజు పాల్గొన్నారు.

తిరుమల లడ్డూల విక్రయం

నారాయణవనంలోలోని కల్యాణ వెంకన్న ఆలయంలో తిరుమల శ్రీవారి ప్రసాదమైన లడ్డూల విక్రయాన్ని శుక్రవారం టీటీడీ ప్రారంభించింది. ఈ సందర్భంగా ఆలయాధికారి నాగరాజు మాట్లాడుతూ... ఒక్కో భక్తుడికి రెండు లడ్డూలు విక్రయిస్తామన్నారు. ఒక లడ్డూ రూ.50 అని చెప్పారు.

వేదోక్తంగా గణపతి హోమం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 13: పట్టణంలోని భేరివారి మండపం వద్ద గణపతి హోమాన్ని శుక్రవారం వేదోక్తంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ యేటా భేరివారి మండపం వద్ద వినాయక చవితిని పురస్కరించుకుని నవరాత్రులను వైభవంగా నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా శుక్రవారం ఏడో రోజు గణపతి హోమం జరిపించారు. భేరివారి మండపం వద్ద ఉదయం హోమగుండాన్ని ఏర్పాటు చేశారు. పండితులు వేదోక్తంగా హోమంలో హవిస్సులు అర్పించి విశేష పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు, టీడీపీ నేతలు ప్రకాష్‌నాయుడు, మురళీనాయుడు, ప్రసాద్‌నాయుడు, వజ్రం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు విశేష పూజలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 13: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై కొలువై ఉన్న కనకదుర్గమ్మకు శ్రావణ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుకాలం సమయంలో అమ్మవారి మూలమూర్తికి వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు.

త్వరలోనే ఎస్సీ హాస్టల్ ప్రారంభం

కేవీబీపురం, సెప్టెంబరు 13: మండల కేంద్రంలో ఎస్సీ బాలుర వసతి గృహాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని సంక్షేమ శాఖ అధికారులు చెప్పారు. శుక్రవారం శిథిలావస్థకు చేరుకున్న ఎస్సీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. కాగా ఎస్సీ బాలుల వసతి గృహం ఐదేళ్ల క్రితం మూతబడింది. దీంతో కేవీబీపురంలోని ఆదర్శ పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న ఎస్సీ విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జిల్లా సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు వసతిగృహాన్ని తనిఖీ చేశారు.

వ్యాను సహా రేషన్ బియ్యం స్వాధీనం

కేవీబీపురం, సెప్టెంబరు 13: మండలంలో గురువారం అర్ధరాత్రి వ్యాను సహా నాలుగు టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వీరాంజనేయులు తెలిపారు. శ్రీకాళహస్తి నుంచి పిచ్చాటూరు వైపు వెళ్తున్న నెం.ఏపీ16 టిఐ2677 వ్యానును పోలీసులు రాగిగుంట వద్ద పట్టుకున్నారు. పరిశీలించగా రేషన్ బియ్యం ఉన్నట్టు గుర్తించారు. రాజేష్, చందును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తహసీల్దార్ ఎదుట విద్యార్థి బైండోవర్

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 13: మండలంలోని కనమనంబేడు ఏకలవ్య గురుకులం నుంచి పారిపోయిన విద్యార్థిని శుక్రవారం పోలీసులు తహసీల్దార్ సుబ్రమణ్యం ఎదుట బైండోవర్ చేశారు. గత నెల 24న పాఠశాల నుంచి విద్యార్థి పారిపోయాడు. విద్యార్థి అదృశ్యంపై తల్లిదండ్రులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పది రోజులు తరువాత హైదరాబాదులో ఉన్నానని తల్లిదండ్రులకు విద్యార్థి సమచారం అందించారు. వారు వెళ్లి గ్రామానికి తీసుకొచ్చారు. ఈక్రమంలో విద్యార్థిని తహసీల్దార్ దగ్గర బైండోవర్ చేయడంతో కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం పాఠశాల సిబ్బందికి అప్పగించారు.

బహిరంగ ప్రకటన

నా కక్షిదారులు టీపీటీ బ్యాంక్ లిమిటెడ్, తిరుపతి వారి సూచనల మేరకు ఇవ్వు ప్రకటన ఏమనా తిరుపతి జిల్లా, రేణిగుంట పాంచాలి నగర్ వాస్తవ్యులైన ఎస్.ఇస్మాయిల్ గారి కుమారుడు ఎస్.కె.డిలీప్ బాషా గారు దిగువ తెలిపిన షెడ్యూలు ప్రాపర్టీకి సంబంధించిన ఒరిజినల్ విక్రయపత్రం నెం.6113/1992,తేది: 21.12.1992 దారపోయినది. ఎవరికైనను దొరికిన యెడల దిగువ తెలిపిన చిరునామాకు 14 రోజులలోపు చేర్చగలరు.

SCHEDULE-A: Chittoor District - Sri Balaji Registration District, Tirupati - Renigunta Sub-Dsitrict - Renigunta Mandal - Renigunta GP - Ward No.14, Panchali Nagar Residential area - No.20, Thukivakam village accounts - Sy.No.812/1 - Site - bounded on: East : Road West : A.C.C.Room vide H.D.No.14-553 of S.K.Munwar North : Site of P.Padma, South : Property of S.K.DileepBasha. **In between this measuring**: East to West 30 fts.or 9.150 mts., North to South 10 fts.or 3.050 mts. Admeasuring 300 Sq.fts. or 33.33 Sq.yards of site.
SCHEDULE-B: Chittoor District - Sri Balaji Registration District, Tirupati - Renigunta Sub-Dsitrict - Renigunta Mandal - Renigunta GP - Ward No.14, Panchali Nagar Residential area - No.20, Thukivakam village accounts - Sy.No. 812/1 - A.C.C.Sheet house vide H.D.NO.14-553 - bounded on: East : Site of S.K.Munwar, West : Site of Kamal Khan, North : Site of P.Padma, South : Property of S.K.Dileep Basha. **In between this measuring**: East to West: 30 fts.or 9.150 mts., North to South 10 fts.or 3.050 mts. Admeasuring 300 Sq.fts. or 33.33 Sq.yards of site, in it constructed A.C.C.Sheet house together with structures and fixtures, etc.
SCHEDULE-C: Chittoor District - Sri Balaji Registration District, Tirupati - Renigunta Sub-Dsitrict - Renigunta Mandal - Thukivakam Village accounts - old Ward No.13, Venugopalapuram Harijanawada, presently new ward No.14, Panchali nagar - Sy.No.812/1 - A.C.C.House vide H.D.No.14-552- bounded on: East : Road, West : Site of Kamal Khan, North :property of S.K.Munwal, N.K.Anwar Hussain, South : Site of Gajalakshmi. **In between this measuring:** East to West: 60 fts.or18.300mts., North to South 10 fts.or 3.050 mts. Admeasuring 600 Sq.fts. or 66.66Sq.yards of site, in it constructed A.C.C.Sheet house measuring East to West 30 fts., North to South 10 fts., an extent of 300 Sq.fts. together with structures and fixtures, etc.

ఎం.హరీష్, అడ్వకేట్,
నెం.100, 1వ అంతస్తు, ప్రకాశం రోడ్డు,
తిరుపతి, సెల్: 9949995779

సీతారాం ఏచూరికి ఘన నివాళులు



పుత్తూరులో సీతారాం ఏచూరికి నివాళులు

పుత్తూరు టౌన్, సెప్టెంబరు 13: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సీతారాం ఏచూరి అని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటేష్ అన్నారు. పట్టణంలోని వర్ధన్ ఆటోస్టాండ్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ వామపక్ష తెలుగు రేఖ ఏచూరి సీపీఎంలో సాధారణ సభ్యుడిగా చేరి అంచెలంచలుగా ఎదిగి దేశ రాజకీయాలకు దిక్సూచిగా మారారని తెలిపారు. విజయ్, యాసిన్, శివ, వెంకటేష్, సీపీఐ నాయకులు రవి తదితరులు పాల్గొన్నారు.
బుచ్చినాయుడుకండ్రిగ: సీతారాం ఏచూరికి సీపీఎం మండల నాయకులు మండల కేంద్రంలో ఘన నివాళులర్పించారు. వివిధ ఉద్యమాల్లో సీతారం ప్రాత ఎన్నదగినదన్నారు. తిరుపాలు, గురువయ్య, రంగయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.
ఏర్పేడు: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి ఏర్పేడు మండలంలో సీపీఎం నాయకులు నివాళులర్పించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, గురవమ్మ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.
శ్రీకాళహస్తి: పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి శుక్రవారం నాయకులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటన్నారు. నేటి తరం కమ్యూనిస్టులు ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. గంధం మణి, రెడ్డిపల్లి సురేష్, కుమార్, అన్వర్‌బాషా, ఉస్మాన్‌బాషా, రాజా, వెలివేంద్రం, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9160195583, 9703618708, 9703618705, 9703618710, 9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME
I, Pulicherla Yughandhara Naidu (Old Name) S/0 Pulicherla Kannaiah Naidu, residing at 1-32, Bheemavaram, Chandragiri, Tirupati Urban, A.P. I declared that i have changed my name as Pulicherla Yugandhar Naidu (New Name).
AJT - 1100

CHANGE OF NAME
I,Syeda Sumiya Iffath (Old Name), D/o .Syed Amanulla , R/o: 25-21/3, Nana Bala Street, Punganur- 517 247, Chittoor Dist. A.P. Hereby declare that I have changed my name as Syeda Sumaiya Iffath (New Name). W/o.Nanjampeta Shaik Ashraf Ali
AJT - 2345

CHANGE OF SURNAME
I, KANDURU RAVI KUMAR (Old Name) R/o:1-72-9-5,Sankar Naidu Colony, THIRUCHANUR,TIRUPATI Dt, A.P. Do here by declared I have changed my Surname as KANDURI RAVI KUMAR (New Name) S/o K.V R RAMANUJA CHARYULU
AJT - M

PLOT FOR SALE
JP Infra, Tirupati కి 10 కిమీ పరిధిలో భూ వరాహ పామ్ ల్యాండ్స్ శ్రీ గంధం మొక్కలతో ప్లాటు అమ్మబడును. ప్లాటులో సుమారు 1 కోటి రూ: అదనపు ఆదాయం వివరాలకు సెల్: 73821 93459, 94415 31587
AJT-

PLOTS FOR SALE
నాయుడుపేట బస్టాండ్ నుండి 4 కిమీ దూరంలో 6 లైన్స్ హైవేకి 2వ బిట్ అయిన తుడా అప్రూవల్ 48 ఎకరాల మెగా వెంచర్‌లో 1 Sq.Feet 420 రూ. మాత్రమే. సెల్: 99660 66111
AJT-4281

వధువు కావలెను
రెడ్డి కులం, వయస్సు : 35, MBA, B.Ed., ఎత్తు-5.9, తిరుపతి. ప్రముఖ వ్యాపార సంస్థ వరుడికి సరైన వధువు కావలెను. సంప్ర. : 91105 49394.
AJT - 187492

FLAT FOR SALE
SUV Non Teaching Colony, Vidyanagar, 2 BHK, 1014 Sq. Feet, West Face with Car Parking in Venkatasai Appartment. Cont. : 99495 35213
AJT - 4278

NEUROLOGIST
డా.కె.నిరంజన్ బాబు, M.D (Med), D.M (Neuro) పక్షవాతం (Stroke), I.C.U (24hrs), ఫిట్స్ (మూర్ఛ) తలనొప్పి, మైగ్రేన్ తలతిరుగుట, తిమ్మిర్లు, మెడ, నడుము, కండరాలు నొప్పులు, సంప్ర. సాయి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, DBR హాస్పిటల్ వెనుక, కొర్లగుంట, తిరుపతి సెల్ : 94944 03825.
AJT - 196762

RENT / LEASE
తిరుపతి లీలామహల్ సర్కిల్, విజ్ఞేష్ టవర్స్‌లో 501, 502 (2300 sft) కమర్షియల్‌కు ఇవ్వబడును. పూర్తి వివరాలకు సంప్రదించండి. సెల్: 98667 26232
AJT-4270

ONE SITTING
Discontinued or ఫెయిలైన విద్యార్థులకు ఒకేసారి పాస్ అయ్యే అవకాశం.10th / Inter / Degree / PG / Diploma/ B.Tech./ LLB / Certificate Courses, UGC Regd. Universities, Sri Sai Education, Kadapa. Cell : 98855 11226
Ajc-196211

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, టెస్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA- 198071

VEHICLE FOR SALE
AP-39 FA 8026 MARUTHI ERTIGA VDI Model - 2012 వాహనము తేది 16-9-2024 న ఉదయం 10.30 ని.లకు అమ్మబడును. వివరములకు అరుణా ఫైనాన్స్ లిమిటెడ్. సెల్ : 93980 26303, 88851 22377
AJB-698

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి